

విశాఖపట్నం



అనకాపల్లి

# సీనియర్లకు బాబు రిక్తహస్తం

- మీమాంశలో పడ్డ గంటా, బండారు, గండి
- భీమిలి నుంచి బైరా ఫౌండేషన్ అధినేత దిలీప్ చక్రవర్తికి అవకాశం ?
- దక్షిణం టికెట్ వంశీకృష్ణకు ఖరారు : అసంతృప్తిలో టిడిపి, జనసేన శ్రేణులు



గంటా శ్రీనివాసరావు



బండారు సత్యనారాయణ మూర్తి



గండి బాబ్జీ

**ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో**

తెలుగుదేశం పార్టీ గురువారం విడుదల చేసిన రెండో జాబితాలోనూ పలువురు సీనియర్లకు మొండిచెయ్యినే ఎదరైంది. బిజెపి, జనసేన పార్టీలతోగల పొత్తుతో పలు సీట్లపై టిడిపి అధినేత చంద్రబాబు సరిగా నిర్ణయం తీసుకోలేని స్థితి నెలకొంది. ఈ నేపథ్యంలో గంటా శ్రీనివాసరావు భీమిలి, గండి బాబ్జీ విశాఖ దక్షిణం టిక్కెట్లు ఆశించి భంగపడ్డారు. బండారు సత్యనారాయణకూ రిక్త హస్తమే ఎదురుకానున్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి. విశాఖ పార్లమెంట్, భీమిలి అసెంబ్లీ సెగ్మెంట్‌పై బాబు ఆలస్యంగా అభ్యర్థుల కసరత్తు చేశారు. పార్లమెంట్ టికెట్‌ను తొలి నుంచీ గీతం విద్యాసంస్థల ఛైర్మన్ శ్రీభరత్ ఆశిస్తున్న విషయం అధిష్టానానికి తెలిసినా ప్రకటన చేయలేదు. బిజెపితోగల పొత్తుతో ఈ లోక్‌సభ స్థానంపై తేల్చలేని స్థితి బాబుకు ఏర్పడింది. ఒకవేళ ఇక్కడ టిడిపికి కాకుండా బిజెపికి ఇవ్వాల్సి వస్తే భరత్‌ను భీమిలికి పంపే యత్నాల్లో బాబున్నట్లు భోగట్టా. ఏదిఏమైనా తాజా రాజకీయ పరిణామాలు ఈ పార్టీలో చూస్తే భీమిలికి టికెట్ ఆశిస్తున్న గంటా శ్రీనివాసరావుకు ఇవ్వలేదు. విజయనగరం జిల్లా చీపురుపల్లి వెళ్లాలని సూచించగా గురువారం రుషికొండలో తన ముఖ్య అనుచరులతో గంటా కీలక భేటీ నిర్వహించారు. కొంతమంది పార్టీని వీడాలని, ఇంకొంతమంది అధిష్టానం మాట వినాలని, ఇలా తలో మాట చెప్పారు. గత్యంతరం లేని స్థితిలో చీపురుపల్లికి వెళతారా? లేక ఇంకో నిర్ణయం తీసుకుంటారా ? అన్నది చూడాల్సిందే!.

**'హాట్ టాపిక్'గా భీమిలి రాజకీయాలు**

భీమిలికి బైరా ఫౌండేషన్ అధినేత, పలు విద్యాసంస్థలకు ఛైర్మన్‌గా ఉన్న దిలీప్ చక్రవర్తిని ఖాయం చేసేందుకు టిడిపి రంగం సిద్ధం చేసినట్టు తెలుస్తోంది. ఆయన అనకాపల్లి ఎంపీ టికెట్ ఆశించి అక్కడ కొంత కాలంగా సేవా కార్యక్రమాలు చేపడుతున్నారు. ఎక్కడైనా పోటీ చేయాలనే ఆలోచన దిలీప్‌లో కనిపిస్తున్న నేపథ్యంలో విశాఖపట్నం ఎంపీ టిడిపికి దక్కితే బైరాకు భీమిలి ఖాయం కానున్నట్టు సమాచారం. గత ఎన్నికల్లో ఉత్తరంలో పోటీచేసి గెలిచిన గంటా విషయంలో టిడిపి అధిష్టానం సానుకూలంగా లేదు. గ్రూపులను నడుపుతూ పార్టీ పట్ల విధేయత లేని నాయకుడంటూ బాహాటంగానే చంద్రబాబు టిడిపి మీటింగుల్లో చెప్పేవారని ఆ పార్టీనేతలు వాపోతున్నారు. జైలులో బాబు ఉన్నప్పుడు కనీసం మీడియా ముందుకు గంటా రాకపోవడం, వైసిపి అధిష్టానంతో కూడా గతంలో భేటీ అయ్యారన్న ఆరోపణలు ఉన్నందున 'పొమ్మనలేక పొగ' పెట్టారన్న చర్చ కూడా టిడిపిలో ప్రస్తుతం నడుస్తోంది. మాజీ మంత్రి, వైసిపి నాయకులు ముత్తంశెట్టి శ్రీనివాసరావు తన పట్టును కోల్పోకుండా నియోజకవర్గంలో కలియతిరుగుతున్నారు. ప్రతిపక్షంలో ఎవరికి టికెట్ వస్తుందో తెలియక ఎవ్వరూ ప్రచారంలోకి రాకపోవడంతో ముత్తంశెట్టి వన్‌సైడ్ ప్రచారం సాగింది.

దక్షిణం టికెట్ జనసేనకు కేటాయించడంతో గండిబాబ్జీకి గండిపడింది. ఇక్కడ 29వ వార్డు గొల్లలపాలెంలో మినహా వంశీకృష్ణ సామాజిక తరగతి ఎక్కడా లేదు. జనసేన టికెట్ కోసం ఆశించి భంగపడ్డ కందుల నాగరాజు గ్రూపు వంశీకృష్ణ పనిచేసే అవకాశం లేదని పలువురు చెబుతున్నారు.

టిడిపి రెండో జాబితాలో

# పల్లా, పైలా, రాజులకు చోటు



పల్లా శ్రీనివాసరావు



పైలా ప్రసాదరావు



కెఎస్ఎన్ఎస్.రాజు

**ప్రజాశక్తి - గాజువాక, చోడవరం విలేకరులు, అనకాపల్లి ప్రతినిధి**

టిడిపి రెండో జాబితాలో ఉమ్మడి విశాఖపట్నానికి సంబంధించి పల్లా శ్రీనివాసరావు, పైలా ప్రసాద్‌రావు, కెఎస్ఎన్ఎస్. రాజులకు చోటుదక్కింది. ఎట్టకేలకు గాజువాక నియోజకవర్గానికి మాజీ ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావుకు టికెట్ దక్కడంతో ఆ పార్టీ కేడర్ హర్షం వ్యక్తం చేసింది. టిడిపి తరపున 2014లో ఎమ్మెల్యేగా పోటీ చేసి విజయం సాధించారు. 2019లో వైసిపి చేతిలో ఓటమి చెందారు. తాజాగా ఈ నియోజకవర్గంపై కొంత సస్పెన్స్ కొనసాగినా ఎట్టకేలకు పల్లాకే టికెట్ దక్కింది. పల్లా తండ్రి మాజీ ఎమ్మెల్యే సింహాచలం అన్న సంగతి తెలిసిందే.

**వి.మాడుగుల ఎమ్మెల్యే అభ్యర్థి పైలా ప్రసాదరావు**

పైలా ప్రసాదరావు బాపట్లలో ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్‌లో బిటెక్ చేశారు. బెంగుళూరులో ఆరేళ్లపాటు బహుళజాతి కంపెనీలో పనిచేశారు. 1999లో అమెరికా వెళ్లి సాఫ్ట్‌వేర్ రంగంలో స్థిరపడ్డారు. ఐటి కంపెనీల ఏర్పాటును ప్రోత్సహించారు. సాజిక్స్, వివిఫై గ్రూపు ఆఫ్ కంపెనీ సిఇఒగా వున్నారు. సేవా కార్యక్రమాలు చేయాలన్న ఆలోచనతో స్వస్థలం చేరుకున్నారు. పైలా ఫౌండేషన్ స్థాపించి పలు సేవా కార్యక్రమాలు కొనసాగిస్తున్నారు. 2009 ఎన్నికల్లో ప్రజారాజ్యం పార్టీ నుంచి పోటీచేసి ఓటమిచెందారు. తరువాత టిడిపిలో చేరి క్రియాశీలక కార్యకర్తగా వున్నారు.

**చోడవరం**

**ఎమ్మెల్యే అభ్యర్థి కెఎస్ఎన్ఎస్ రాజు**

కలిదిండి సూర్య నాగ సన్యాసిరాజు (కెఎస్ఎన్ఎస్.రాజు) బికాం, బిఎల్ చేశారు. సర్పంచ్‌గా ఆయన రాజకీయ ప్రస్థానం ప్రారంభమైంది. 1995లో చోడవరం సర్పంచ్‌గా ఎన్నికయ్యారు. 2005లో పిఎసిఎస్ అధ్యక్షునిగా, 2008లో చోడవరం మండల పరిషత్ అధ్యక్షునిగా పనిచేశారు. 2009, 2014 ఎన్నికల్లో వరుసగా రెండుసార్లు ఎమ్మెల్యేగా గెలిచారు. 2019 ఎన్నికల్లో ఓటమిపాలయ్యారు. నాలుగోసారి టిడిపి అభ్యర్థిగా బరిలో దిగుతున్నారు.

# నియోజకవర్గ ఇన్‌ఛార్జిలకు మొండిచేయి

◆ టిడిపి రెండో జాబితాపై కేడర్‌లో అసంతృప్తి ◆ తాతయ్యబాబు, పివిజి.కుమార్‌లకు అవమానం

**ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి, చోడవరం**

జిల్లాలోని నియోజకవర్గ ఇన్‌ఛార్జ్‌లకు టిడిపి మొండిచేయి చూపింది. తొలి, మలి విడత అభ్యర్థుల జాబితాలో ఆశావహులెవరికీ టిక్కెట్ ఇవ్వలేదు. ఐదేళ్లపాటు పార్టీ పిలుపుల్లో పాలుపంచుకున్న ఇన్‌ఛార్జ్‌లను పక్కనబెట్టి, పార్టీ కార్యక్రమాల్లో అంటీముట్టనట్లున్న వారికి టిక్కెట్లు కేటాయించినట్టు విమర్శలు వినిపిస్తున్నాయి. జిల్లాలోని పాయకరావుపేట, నర్సీపట్నం, యలమంచిలి, చోడవరం, వి.మాడుగుల, అనకాపల్లి, పెందుర్తి (పాక్షికం) నియోజకవర్గాల్లో మూడు నియోజకవర్గాల(అనకాపల్లి, పెందుర్తి, యలమంచిలి)ను బిజెపి, జనసేన పొత్తులో జనసేనకు టిడిపి కేటాయించింది. మరో నాలుగు నియోజకవర్గాల్లో పాయకరావుపేట, నర్సీపట్నం నియోజకవర్గ ఇన్‌ఛార్జ్‌లు అనిత, అయ్యన్నపాత్రుడులకు టిక్కెట్లు కేటాయించింది. అంత వరకూ బాగానే ఉన్నా చోడవరం, మాడుగుల నియోజకవర్గాల ఇన్‌ఛార్జ్‌లు బత్తుల తాతయ్యబాబు, పివిజి.కుమార్‌లను కాదని మాజీ ఎమ్మెల్యే కెఎస్ఎన్ఎస్.రాజు, ఎన్ఆర్ఐ పైలా ప్రసాద్‌కు రెండో జాబితాలో టిక్కెట్లు కేటాయించారు. జిల్లాలో పొత్తుల్లో మూడు నియోజకవర్గాలను టిడిపి కోల్పోవడంతో ఇప్పటికే ఆశావహులు తీవ్ర నిరాశలో వున్నారు. పార్టీ పనిలో భాగస్వాములు కాని రాజు, పైలా ప్రసాద్‌కు తాజాగా టిక్కెట్ ఇవ్వడంపై ఆ నియోజకవర్గంలో కేడర్ అసంతృప్తికి గురైంది. ఎంత సర్దిచెప్పినా, వచ్చే ఎన్నికల్లో టిక్కెట్లు రాని తాతయ్యబాబు, పివిజి.కుమార్ మనస్ఫూర్తిగా పార్టీ అభ్యర్థులకు సహకరించే పరిస్థితిలేదని ఆ పార్టీలోని కొంతమంది సీనియర్లు చెబుతున్నారు.

గురువారం చంద్రబాబు ప్రకటించిన రెండో జాబితాలో సీనియర్ నాయకుడైన బండారు సత్యనారాయణమూర్తికి చోటు దక్కలేదు. పెందుర్తి నుంచి పోటీచేయాలని ఆశపడ్డ ఆయనకు పొత్తు వల్ల ఎసరు వచ్చింది. ఆ నియోజకవర్గం జనసేనకు ఇవ్వడంతో బండారుకు చుక్కెదురైంది. మాడుగుల నియోజకవర్గంలో చాలా కాలంగా మూడు గ్రూపులున్నాయి. మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడు, పైలా ప్రసాద్, నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ పివిజి కుమార్ టిక్కెట్ కోసం ఎవరి ప్రయత్నాలు వారు చేశారు. పార్టీ కార్యక్రమాలు నిర్వహించే మనిషిలేకపోవడంతో ఆ బాధ్యతను కుమార్‌కు అప్పగించారు. కానీ ఎన్నికల్లో ఆయనకు టిక్కెట్ ఇవ్వకుండా ఎన్ఆర్ఐ ప్రసాద్‌కు కేటాయించారు. ఒకే సామాజిక తరగతికి చెందిన ఆశావహుల ముగ్గురిలో ప్రసాద్ ఆర్థిక పరిస్థితి మెరుగ్గా వుండడంతో చంద్రబాబు ఆయన వైపు మొగ్గుచూపినట్టు తెలుస్తోంది. మహానాడులో పార్టీ నిధి నిమిత్తం కోటి రూపాయలు ప్రసాద్ అందజేశారు. ఆయన పట్ల చంద్రబాబు సానుకూలతకు ఇదొక కారణమని పార్టీలో చర్చ జరుగుతోంది. మాజీ ఎమ్మెల్యే కెఎస్ఎన్ఎస్ రాజు పార్టీ కార్యక్రమాలకు దూరంగా వుండడంతో నియోజకవర్గ పార్టీ బాధ్యతలు బత్తుల తాతయ్యబాబుకు అప్పగించారు. ఆర్థిక పరిస్థితి చెప్పుకోదగ్గది కాకపోయినా చంద్రబాబు మాటకాదనలేక అప్పోసప్పోజేసి పార్టీ కార్యక్రమాలు నిర్వహించుకుంటూ వచ్చారు. తీరా ఎన్నికల్లో అభ్యర్థిగా ఆయనను ప్రకటించకుండా రాజుకు టిక్కెట్ ఇవ్వడంతో పార్టీ కేడర్ అసంతృప్తి వ్యక్తం చేస్తోంది. డబ్బుకు తప్ప పార్టీని నమ్ముకొని పనిచేసే వారికి సరైన స్థానం వుండదన్న చర్చ టిడిపి శ్రేణుల్లో సాగుతోంది.

# జర్నలిస్టుల సమస్యలు తక్షణమే పరిష్కరించాలి

## రాజకీయ పార్టీల, ప్రజా సంఘాల నేతలు డిమాండ్

**ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ :** జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కోరుతూ విజెఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో గురువారం జర్నలిస్టు సంఘాల ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. లోకల్ న్యూస్ పేపర్స్ అసోసియేషన్ (ఎల్ఎన్ఎ) అధ్యక్షుడు పి.సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు, సిపిఐ జిల్లా కార్యదర్శి పైడిరాజు, పిఒడబ్ల్యు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.లక్ష్మి, సిపిఎం నాయకులు ఆర్‌కెఎస్‌వి.కుమార్, జాప్ రాష్ట్ర అధ్యక్షులు ఎం.యుగంధర్ రెడ్డి, ఎన్‌యుజెఐ జాతీయ కార్యనిర్వాహక కార్యదర్శి నాగబోయిన నాగేశ్వరరావు, ఐఎఫ్‌టియు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం. వెంకటేశ్వర్లు, ఐడిజెఎస్ రాష్ట్ర అధ్యక్షుడు టి.నానాజీ, భారత్ బచావో ప్రతినిధులు ఎస్సార్ వేమన, శ్రీనివాస్, డిహెచ్‌పిఎస్ రాష్ట్ర అధ్యక్షులు జెవి.ప్రభాకర్, భీమ్ సేనా వార్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ వి.రాజేంద్రప్రసాద్, ఎపిజెయు రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ వెంకటవేణు, ఎపియూడబ్ల్యూజె జిల్లా ప్రధాన కార్యదర్శి కె.చంద్రమోహన్, జాప్ జిల్లా ప్రధాన కార్యదర్శి కెఎం.కీర్తనరావు పాల్గొని మాట్లాడారు. జర్నలిస్టులందరూ దాదాపుగా అల్పదాయ వర్గంగానే ఉన్నారని తెలిపారు. వారికి ఇళ్ల స్థలాలు ఇస్తామని మూడు నెలలు క్రితం జిఒ విడుదల చేసినప్పటికీ ప్రక్రియ ఇంత వరకు పూర్తి చేయకపోవడం ప్రభుత్వానికి తగదన్నారు. ఎన్నికలకులోపే నామమాత్రపు ధరకు ఇళ్ల స్థలాలు ఇచ్చి మాట నిలబెట్టుకోవాలన్నారు. జర్నలిస్టులకు పెన్షన్ మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. జర్నలిస్టులపై దాడులు పెరగడంపై ఆందోళన వ్యక్తం చేశారు. సమాచార రంగంలో కీలకపాత్ర పోషిస్తున్న స్థానిక పత్రికలకు తగిన సహకారం ప్రభుత్వం ఇవ్వాలన్నారు.

## మాజీ మంత్రి బండారు అనుచరుల నిరసన

**ప్రజాశక్తి - పరవాడ :** పెందుర్తి నియోజకవర్గం టికెట్ టిడిపి నేత, మాజీ మంత్రి బండారు సత్యనారాయణమూర్తికి కాకుండా జనసేన పార్టీ తరపున పంచకర్ల రమేష్ బాబుకు కేటాయించడంపై మండలోని వెన్నెలపాలెం గ్రామంలో బండారు సత్యనారాయణమూర్తి నివాసం వద్ద టిడిపి కార్యకర్తలు గురువారం నిరసన తెలిపారు. పంచకర్ల వద్దు.. బండారు ముద్దు అంటూ పెద్ద పెట్టున నినాదాలు చేశారు. చంద్రబాబు, పవన్ కళ్యాణ్ వైఖరి మార్చుకోవాలన్నారు. ఇప్పటి వరకు నియోజకవర్గంలో ఇంటింటికి తిరిగిన బండారు కాదని, పంచకర్లకు టికెట్ ఎలా ఇస్తారు వారు ప్రశ్నించారు.

## వ్యాపారవేత్తలుగా అభివృద్ధి చెందాలి

**ప్రజాశక్తి-అనకాపల్లి :** ప్రతి రైతు ఒక వ్యాపార వేత్తలుగా అభివృద్ధి చెందాలని అనకాపల్లి పార్లమెంటు సభ్యురాలు డాక్టర్ బివి సత్యవతి ఆకాంక్షించారు. స్థానిక ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానంలో మూడున్నర కోట్ల రూపాయలతో భారత ఆహార శుద్ధి పరిశ్రమల శాఖ నిర్మించిన ఇంక్యుబేషన్ సెంటర్‌ను గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి రైతు వ్యవసాయ సాంకేతిక పరిజ్ఞానాన్ని సద్వినియోగం చేసుకొని పారిశ్రామికవేత్తలుగా ఎదగాలన్నారు. కార్యక్రమంలో ఎన్‌జి రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిశోధన సంచాలకులు డాక్టర్ ఎల్ ప్రశాంతి, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి ప్రభాకర్‌రావు, ఆర్ఏఆర్ఎస్ శాస్త్రవేత్తలు డాక్టర్ సిహెచ్ ముకుందరావు, ఆదిలక్ష్మి, ఎం విశాలాక్షి, కెవి రమణమూర్తి, ఉమామహేశ్వరరావు, వైసిపి నాయకులు డాక్టర్ విష్ణుమూర్తి, డాక్టర్ బొడ్డేడ లక్ష్మి నరసింహ పాల్గొన్నారు.

## డ్రెయినేజీలను శుభ్రం చేయాలి

**ప్రజాశక్తి చోడవరం, చోడవరం రూరల్ :** చోడవరం పంచాయతీ పరిధిలోని పిఎస్ పేట రోడ్‌లో డ్రైనేజీ లీకై రోడ్డు మీదకు విపరీతమైన మురుగునీరు వస్తుందని, పంచాయతీ పట్టించుకోకపోవడం వల్ల ప్రజల అసౌకర్యానికి గురవుతున్నారని, వెంటనే పంచాయతీ శ్రద్ధ తీసుకొని డ్రెయినేజీని శుభ్రం చేయాలని సిఐటియు జిల్లా కార్యదర్శి జి వరలక్ష్మి డిమాండ్ చేశారు. గురువారం ఆమె స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ చోడవరంలో సరైన రోడ్లు ఎలాగూ లేవని, కనీసం డ్రైనేజీ సమస్యను కూడా తీర్చలేని పరిస్థితిలో చోడవరం పంచాయతీ ఉందని పేర్కొన్నారు. డ్రైనేజీలో బ్లీచింగ్ జల్లకపోవడంతో దోమల బెడద ఎక్కువగా ఉంటుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా పాలకులు అధికారులు అపారిశుధ్యంపై దృష్టి పెట్టాలని డిమాండ్ చేశారు.

## ఘనంగా సత్యనారాయణ వర్ధంతి

**ప్రజాశక్తి- కె.కోటపాడు :** విశాఖ డెయిరీ మాజీ డైరెక్టర్ సుందరపు సత్యనారాయణ వర్ధంతి వేడుకలు మండలంలోని చౌడువాడ గ్రామంలో ఆయన స్వగ్రామంలో గురువారం ఘనంగా నిర్వహించారు. సత్యనారాయణ తనయుడు, ప్రస్తుత విశాఖ డెయిరీ డైరెక్టర్ సుందరపు గంగాధర్ ఆధ్వర్యంలో చౌడువాడ జిల్లా పరిషత్ హైస్కూల్‌లో పదవ తరగతి పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు 151 మందికి పరీక్ష సామాగ్రి అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం ఈర్ల అప్పారావు, సర్పంచ్ దాడి ఎరుకు నాయుడు, వైసిపి నాయకులు దాట్ల శివాజీ రాజు. ఎంపీటీసీ ఏటికూరు రాజేష్, వైస్ ఎంపీపీ రొంగలి సూర్యనారాయణ, పాల సొసైటీ అధ్యక్షులు కుమార వెంకటరమణ (పీర్లెస్) పాల్గొన్నారు.



టెన్ విద్యార్థులకు పరీక్షల మెటీరియల్ పంపిణీ చేస్తున్న గంగాధర్ తదితరులు

# రైతుల పోరాటానికి విశేష మద్దతు

## విశాఖ, అనకాపల్లి జిల్లాల్లో పలుచోట్ల సంఘీభావ కార్యక్రమాలు




విశాఖలో మాట్లాడుతున్న సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు

**ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్**

ఢిల్లీ రాంలీలా మైదానంలో లక్షలాది మంది రైతులతో జరుగుతున్న పోరాటానికి సిఐటియు మద్దతు తెలుపుతోందని, సోమనాథన్ కమిషన్ సిఫార్సులు అమలు చేసేవరకూ పోరాడుతామని సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు అన్నారు. గురువారం జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద సిఐటియు విశాఖ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో రైతుల ఉద్యమానికి మద్దతుగా సంఘీభావ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా నర్సింగరావు మాట్లాడుతూ దేశంలో వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్లకు కట్టబెట్టే చర్యలను మోడీ సర్కారు తీవ్రతరం చేసిందన్నారు. రైతాంగం హక్కులను కాలరాస్తోందని తెలిపారు. సెంట్రల్ వేర్ హౌస్‌లన్నింటినీ అంబానీ, అదానీలకు అప్పగించడంతో రాబోయే కాలంలో ఆహార భద్రతకు ప్రమాదం ఏర్పడనుందన్నారు. 2021లో ఢిల్లీలో రైతులు చేపట్టిన ఉద్యమం తరువాత 2022లో యుపికి ఎన్నికలు వచ్చాయని, దానిలో బిజెపి లబ్ధిపొందడం కోసం ఆనాడు తెచ్చిన నల్లచట్టాలను వెనక్కు తీసుకుంటున్నామని, సోమనాథన్ సిఫార్సులను అమలు చేస్తామని హామీ ఇచ్చిందన్నారు. దాన్ని అమలు చేయకపోవడంతో పంజాబ్, హర్యానా, గుజరాత్ తదితర రాష్ట్రాల రైతులు 2024 జనవరి నుండి మళ్ళీ ఢిల్లీలో ఉద్యమాన్ని ప్రారంభించారన్నారు. నేడు రైతుల పోరాటంపై కేంద్రం ఎంతటి నిర్బంధం విధిస్తోందో తెలిపారు. ఇప్పటికైనా ఆ చర్యలను ఉపసంహరించుకుని రైతుల పంటకు గ్యారెంటీ చట్టం తీసుకురావాలని కోరారు. విద్యుత్ మీటర్లను తొలగించి ఉచిత విద్యుత్‌ను రోజుకు 9 గంటలు అందించాలని, రైతుల డిమాండ్లను తక్షణమే పరిష్కరించాలని, స్టీల్‌ప్లాంట్ అమ్మకం ఆపాలని, రైతులకు బీమా సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో కార్మిక, కర్షక మైత్రితో 2024 ఎన్నికల్లో బిజెపిని బంగాళాఖాతంలో కలిపే విధంగా విస్తృత క్యాంపెయిన్ చేస్తామన్నారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్, నాయకులు పి.మణి, ఎస్.జ్యోతీశ్వరరావు, బి.జగన్, ఎం.సుబ్బారావు, యు.రాజు, టి.నూకరాజు, జి.అప్పలరాజు, కె.చంద్రమౌళి, కె.కుమారి, పి.వెంకటరావు, ఎం.సూరీడు, జి.పోలేశ్వరరావు, నాయుడు, శ్రీను, అనీల్ తదితరులు పాల్గొన్నారు.

**అనకాపల్లి :** కేంద్రంలోని బిజెపి ప్రభుత్వ రైతాంగ, కార్మిక వ్యతిరేక విధానాలపై కేంద్ర కార్మిక సంఘాలు, సంయుక్త కిసాన్ మోర్చ పిలుపు మేరకు గురువారం స్థానిక నాలుగు రోడ్ల కూడలి వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న రైతు సంఘం రాష్ట్ర నాయకులు మర్రాపు సూర్యనారాయణ మాట్లాడుతూ బిజెపి అధికారంలోకి వచ్చిన తర్వాత వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్ కంపెనీలకు కట్టబెట్టడానికి పూనుకుందన్నారు. రాష్ట్రానికి ద్రోహం చేసిన బిజెపితో రాష్ట్రంలోని టిడిపి, జనసేన పార్టీలు జతకట్టగా, వైసిపి అన్ని సందర్భాల్లో మద్దతుగా నిలుస్తుందని పేర్కొన్నారు. ఆ పార్టీలకు రానున్న ఎన్నికల్లో బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వైఎన్ భద్రం (ఏఐటియుసి), ఆర్.శంకరరావు, జి కోటేశ్వరరావు, పరమేశ్వరరావు, బి.నూక అప్పారావు, బి ఉమా మహేశ్వరరావు (సిఐటియు), కర్రి అప్పారావు, సదాశివరావు, కొరిబిల్లి శంకరరావు, బాలు గాడి, కునిసెట్టి సురేష్, కాళ్ల తేలయ్యబాబు,బోడి రాజు, వై. శివ,అజయ్ (రైతు సంఘాలు) పాల్గొన్నారు.

**మునగపాక :** సిఐటియు, రైతు సంఘాలు సంయుక్త ఆధ్వర్యాన స్థానిక మెయిన్ రోడ్డుపై గురువారం రాస్తారోకో నిర్వహించారు. ఢిల్లీ సరిహద్దుల్లో రైతులపై తుపాకుల కాల్పులు జరపడం దారుణమన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు వివి శ్రీనివాసరావు, ఎస్.బ్రహ్మాజీ, వ్యకాస నాయకులు ఆళ్ల మహేశ్వరరావు, టెక్కలి జగ్గారావు, అల్లారపు లోవేశ్వరరావు, ఆడారి రాంబాబు, మళ్ల సంజీవ రావు తదితరులు పాల్గొన్నారు.

**పరవాడ :** స్థానిక సినిమా హాల్ జంక్షన్లో సిఐటియు ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు గనిశెట్టి సత్యనారాయణ, నాయకులు పల్లి అప్పారావు, ఎస్ చిన్నారావు, ఎం గోవిందు, జి ప్రసాద్, నాయుడు పాల్గొన్నారు.

**రాంబిల్లి :** కేంద్ర బీజేపీ ప్రభుత్వ విధానాలపై మండల కేంద్రంలో నిరసన తెలిపారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు జి.దేవుడు నాయుడు, నాయకులు వై రాము, ఎన్ నారాయణరావు, వై శ్రీనివాస్ రెడ్డి, రైతులు పాల్గొన్నారు.



అచ్యుతాపురం మండలం జగన్నాథపురంలో చెరుకు గడలతో రైతుల నిరసన

**అచ్యుతాపురం :** మండలంలోని తిమ్మరాజుపేట, అచ్యుతాపురం జంక్షన్‌ల్లో రైతులు, కార్మికులు, ఉపాధి కూలీలు నిరసన కార్యక్రమాలు చేపట్టారు. ఎం జగన్నాధపురంలో చెరుకు గడలతో నిరసన తెలిపారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కర్రి అప్పారావు, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఆర్.రాము, కౌలు రైతు సంఘం కార్యదర్శి కె.రామ సదాశివరావు, నిర్వాసితుల సంఘ అధ్యక్షులు బుద్ధ రంగారావు, ప్రజా సంఘాల నాయకులు బ్రహ్మాజీ, రొబ్బా సాంబమూర్తి, నెట్టే నరసింహరావు, ఆడారి రామకృష్ణ, దూళి నూకరాజు పాల్గొన్నారు.

**నక్కపల్లి :** రైతులకు ఇచ్చిన హామీలను కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అమలు చేయాలని కోరుతూ నక్కపల్లిలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం, సిఐటియు సంఘీభావం తెలిపి, నిరసన వ్యక్తం చేశాయి. ఎపి రైతు సంఘం అనకాపల్లి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.అప్పలరాజు నాయకులు ఎం.మహేష్ బాబు, జి.రమణ, జి.సోమేశ్వరరావు, సి.హెచ్.సోమేష్, కె.భూలోక, ఎ.అప్పారావు, కె.కాశీ, ఆర్.లోవరాజు, ఆర్.నూకరాజు పాల్గొన్నారు.

**అనకాపల్లి డెస్క్ :** ఛలో ఢిల్లీ రైతాంగ ఉద్యమానికి మద్దతుగా స్థానిక ఎన్టీఆర్ స్టేడియం గాంధీ విగ్రరహం వద్ద నిరసన తెలిపారు. రైతుల పోరాట సమయంలో కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని నినాదాలు చేశారు. కార్యక్రమంలో పలు సంఘాల నాయకులు మాకిరెడ్డి రామునాయుడు, అడిగర్ల రాజు, జి.గురుబాబు, ఎల్.గౌరి, టి.ఈశ్వరరావు, వి.సామ్రజ్యం, నాగమణి, రుత్తల గోవింద్, సాంబ పాల్గొన్నారు

**అనకాపల్లి డెస్క్ :** ఎస్.రాయవరం మండలం తిమ్మాపురంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు మార్త సత్యనారాయణ ఆధ్వర్యంలో ఉపాధి పని ప్రదేశంలో కూలీలతో కలిసి ఆందోళన చేపట్టారు. రైతాంగ ఉద్యమానికి సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో కర్రి సుబ్బాజీ, సత్యవతి, సక్క సత్యనారాయణ, జల్లూరు లావరాజు పాల్గొన్నారు.

**తగరపువలస :** సిఐటియు భీమిలి జోన్ కమిటీ ఆధ్వర్యాన స్థానిక వై జంక్షన్ వద్ద కార్మికులు రాస్తారోకో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆటో కార్మిక సంఘం అధ్యక్షులు నీలాతి రాము, పల్లా పెంటరాజు, జి.అప్పన్న తదితరులు పాల్గొన్నారు

**సీతమ్మధార :** అక్కయ్యపాలెంలో సిఐటియు ఆధ్వర్యాన సంఘీభావ నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో అక్కయ్యపాలెం జోన్ కార్యదర్శి ప్రకాశరావు, నాయకులు అప్పారావు, రాజు కార్మికులు పాల్గొన్నారు.




అనకాపల్లిలో మాట్లాడుతున్న రైతు సంఘం రాష్ట్ర నేత సూర్యనారాయణ

## సమగ్ర సస్యరక్షణతో అధిక దిగుబడులు

**ప్రజాశక్తి- సబ్బవరం :** వేరుశనగ పంటలో సమగ్ర సస్యరక్షణ, పోషకాల యాజమాన్యం చేయడం ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చునని అనకాపల్లి వ్యవసాయ సబ్ డివిజన్ వ్యవసాయ సహాయ సంచాలకులు ఎం.రామారావు రైతులకు సూచించారు. మండలంలోని మల్లు నాయుడుపాలెం గ్రామంలో రైతులు సాగు చేస్తున్న వేరుశనగ, నువ్వు పంటలను గురువారం సందర్శించారు. రైతులు చేపడుతున్నటువంటి సస్యరక్షణ, ఎరువుల వినియోగం గురించి వారితో చర్చించి తగు సూచనలు అందించారు. కార్యక్రమంలో సర్పంచ్ బోను దేముడమ్మ గంగునాయుడు, ఎంపిటిసి గొర్లి కనకరాజు, ఎఒ పోతల సత్యనారాయణ, ఎఈఒ బాలరాజు, విఎఎ హేమలత పాల్గొన్నారు.

## తుమ్మపాల సుగర్స్ కార్మికులకు బకాయిల చెల్లింపు

**ప్రజాశక్తి -అనకాపల్లి :** తుమ్మపాల సుగర్ ఫ్యాక్టరీ కార్మికులకు బకాయిపడ్డ మొత్తాన్ని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్నాథ్ చొరవతో సుమారు 5 కోట్ల రూపాయలను ప్రభుత్వం విడుదల చేసింది. ఈ మొత్తానికి సంబంధించిన చెక్కులను రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్నాథ్ గురువారం ఆయా కార్మికులకు, వారి కుటుంబాలకు అందజేశారు. కార్యక్రమంలో ఇన్ ల్యాండ్ వాటర్ వేస్ అథారిటీ చైర్మన్ దంతులూరి దిలీప్ కుమార్, అనకాపల్లి నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త భరత్ పాల్గొన్నారు.

## పాపయ్య, గురునాథ్‌రావు విగ్రహాలు ఆవిష్కరణ

**ప్రజాశక్తి- కశింకోట :** మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ పక్కన కీర్తిశేషులు వడ్డాది పాపయ్య గుడివాడ గురునాథరావు విగ్రహాలను రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్నాథ్ గురువారం ఆవిష్కరించారు. అనంతరం తుమ్మపాల సుగర్ ఫ్యాక్టరీలో పని చేసి విఆర్ఎస్ పొందిన కార్మికులకు చెక్కులు అందజేశారు. నరిసింగబిల్లిలో సచివాలయం, పశు వైద్యశాల భవనాలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపీ డాక్టర్ బివి.సత్యవతి, విష్ణుమూర్తి, వైసిపి నియోజకవర్గ ఇన్చార్జ్ మలసాల భరత్ కుమార్, ఎంపీపీ కలగా లక్ష్మి గున్నయ్య నాయడు, వైస్ ఎంపీపీ నమ్మి మీనా గణేష్, వైసిపి నాయకులు మందపాటి జానకిరామరాజు, దంతులూరి దిలీప్ కుమార్, మలసాల కిషోర్, సర్పంచ్‌లు జయరజిని, కొన అరుణ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

## మేధోహక్కులపై గీతంలో వర్క్‌షాపు

**ప్రజాశక్తి -మధురవాడ :** గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం టెక్నాలజీ ఎనేబిలింగ్ సెంటర్ (జి-టెక్) ఆధ్వర్యాన విశాఖలోని వివిధ కళాశాలల బోధనా సిబ్బందికి, పరిశోధకులకు మేధోహక్కులపై గురువారం వర్క్‌షాప్ నిర్వహించారు. నల్సార్ విశ్వవిద్యాలయం ఐపిఆర్ నిపుణుడు కె.రవీంద్రనాథ్, భారతీయ మేధోహక్కులపై నిపుణురాలిగా పేరొందిన ఉమా పరమేశ్వరన్ హాజరై పరిశోధనా ఫలితాలను పేటెంట్ చేసే విధానం, మేధోహక్కులను పొందడం ద్వారా కలిగే ప్రయోజనాలను వివరించారు. కార్యక్రమంలో జి-టెక్ డిప్యూటీ డైరెక్టర్ సోంభట్ శాస్త్రి, మెకానికల్ విభాగాధిపతి ప్రొఫెసర్ వి.శ్రీనివాస్, అధ్యాపకులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు నోట్ బుక్స్ పంపిణీ

**ప్రజాశక్తి- ఆనందపురం:** మ్యాజిక్ బస్ ఆధ్వర్యాన ఆనందపురం జడ్‌పి హైస్కూల్లో విద్యార్థులకు మ్యాజిక్ షీట్స్ బుక్‌లెట్‌ను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ చందక లక్ష్మి, సూరిబాబు, ఎంపిటిసి సభ్యులు కొట్యాడ రమాదేవి, రెడ్డి బాబు, చందక అప్పలనాయుడు, మజ్జి రాజు, వెంకటరావు, ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసరావు, పీడీ ప్రసాద్, దూడ రమేష్, కె.రవణమ్మ, టి.ఆదిలక్ష్మి పాల్గొన్నారు.

## విద్యార్థులకు పరీక్ష కిట్లు

**ప్రజాశక్తి- ఆనందపురం:** మండలంలోని గిడిజాల హైస్కూల్లో పదో తరగతి విద్యార్థులు 75 మందికి పరీక్ష కిట్లును ఆనందపురం మండల వైస్ ఎంపిపి పాండ్రంకి శ్రీను గురువారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యార్థులు శత శాతం ఉత్తీర్ణత సాధించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గిడిజాల సర్పంచ్ షినగం అప్పలరాజు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు కెవిఎస్ఎన్ పాత్రుడు, కోరాడ ముసలి నాయుడు, టి.రాము, ఎస్.రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

## బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపిక

**ప్రజాశక్తి -తగరపువలస :** తమిళనాడులోని దిండిగల్‌లో ఈ నెల 21 నుంచి 25వ తేదీ వరకు మహిళా విభాగంలో జరిగే అంతర్జాతీయ బ్యాడ్మింటన్ పోటీలకు స్థానిక సంగివలస అనిల్ నీరుకొండ దంత వైద్య కళాశాల విద్యార్థినులు కె.వెంకటగాయత్రి, జి.సిరి, జ్యోతి, మణిమాల ఎంపికయ్యారని ప్రిన్సిపల్ డాక్టర్ ఎల్.వంశీకృష్ణారెడ్డి గురువారం తెలిపారు. ఎంపికైన విద్యార్థినులను కళాశాల డీన్ డాక్టర్ పివి.సుధాకర్, ప్రిన్సిపల్ వంశీకృష్ణారెడ్డి, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ శ్రీధర్‌రెడ్డి, స్పోర్ట్స్ కార్యదర్శి డాక్టర్ నరేష్, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ శివప్రసాద్ ఫిజికల్ డైరెక్టర్ గన్నాజీ అభినందించారు.

## అనియత విద్యా బోధకులు సర్వీస్ సర్టిఫికెట్లు అందించాలి

**ప్రజాశక్తి -ఆనందపురం :** అనియత విద్యా బోధకులు, సూపర్‌వైజర్లకు ప్రభుత్వ ఉద్యోగ అవకాశాల నిమిత్తం గతంలో పనిచేసిన కాలం సర్వీసు సర్టిఫికెటు, అపాయింట్‌మెంట్ ఆర్డర్ తదితరాలతో కూడిన వివరాలను ఈ నెల 18వ తేదీ లోపు జిల్లా సమగ్ర శిక్ష ఎపిసికి సమర్పించాలని అనియత విద్యా బోధక సూపర్‌వైజర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎం.రమణ (9573254837), కార్యదర్శి టి.లక్ష్మణరావు (9849739240), ఉపాధ్యక్షులు సిహెచ్ శంకరరావు (9848685135) తెలిపారు. పూర్తి వివరాలకు తమను సంప్రదించాలని సూచించారు.

## గ్లకోమాను ముందుగా గుర్తిస్తే అంధత్వాన్ని నివారించొచ్చు

**ప్రజాశక్తి - ఆరిలోవ :** గ్లకోమా అనేది కంటి ఒత్తిడి సంబంధిత దృష్టి లోపం కలిగించే వ్యాధి అని, ముందుగా గుర్తిస్తే అంధత్వాన్ని నివారించవచ్చని ఎల్‌వి.ప్రసాద్ కంటి ఆసుపత్రి ఆప్తమాలజిస్ట్ డాక్టర్ దివ్య దంగేటి తెలిపారు. ప్రపంచ గ్లకోమా వారోత్సవాలను పురస్కరించుకొని ఎల్‌వి ప్రసాద్ కంటి ఆసుపత్రి ఆధ్వర్యాన గురువారం ఆసుపత్రిలో గ్లకోమా రోగులతో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా టర్నింగ్ పాయింట్ మేనేజ్‌మెంట్ సొల్యూషన్ ప్రిన్సిపల్ కన్సల్టెంట్ విశ్వనాథం బెండపూడి మాట్లాడుతూ, గ్లకోమా వ్యాధితో తనకు ఉన్న అనుభవాలను రోగులతో పంచుకున్నారు. డాక్టర్ దివ్య దంగేటి మాట్లాడుతూ, కొన్ని రకాల వ్యాధులకు దీర్ఘకాలం స్టెరాయిడ్స్ వాడకం వల్ల కంటి లోపల ఒత్తిడి పెరిగి దృష్టి లోపానికి దారితీస్తుందన్నారు.

## 52వ వార్డులో జియ్యాని ఎన్నికల ప్రచారం

**ప్రజాశక్తి-వేపగుంట :** జివిఎంసి 52వ వార్డులో నగర డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించారు. ఈ మేరకు గురువారం కరాస, న్యూ కరాస ప్రాంతాలలో 85 ఏళ్ల పైబడిన వారిని, శారీరక వికలాంగులను వారి ఇళ్లకు వెళ్లి కలిశారు. పశ్చిమ నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్‌కు ఎమ్మెల్యేగా, విశాఖ పార్లమెంట్ అభ్యర్థి బొత్స ఝాన్సీకి ఓటువేయాలని అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో శ్రీదేవివర్మ, వెదుళ్ల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

### వేతన సమస్యతో విధులకు సిబ్బంది గైర్హాజరు

## కొత్తకోటలో తాగునీటికి కటకట

**ప్రజాశక్తి -కొత్తకోట :** రావికమతం మండలం కొత్తకోట గ్రామంలో గురువారం తాగు నీరు సరఫరా నిలిచి పోయింది. తాగునీరు సరఫరా విభాగంలో పనిచేసే సిబ్బంది నలుగురూ ఒకేసారి విధులను బహిష్కరించారు. దీంతో తాగునీరు సరఫరా కాలేదు. తమకు మూడు నెలలుగా జీతాలు చెల్లించలేదని ఎన్నిమార్లు అడిగినా పాలకవర్గం పట్టించుకోలేదని, అందుకే విధులను బహిష్కరించినట్లు తాగు నీటి సరఫరా ఉద్యోగి గ్యెర్రిడ్డి ధర్మరాజు తెలిపారు. అసలే వేసవి కాలం కావడం, నీరు సరఫరా కాక గ్రామస్తులు ఇబ్బందులు పడ్డారు. తక్షణం పాలకులు స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు. దీనిపై సర్పంచ్ కిరణ్ లోవరాజు, ఉప సర్పంచ్ వందల దేవను సంప్రదించగా చిన్నపాటి సాంకేతిక సమస్య కారణంగా జీతాల సమస్య తలెత్తిందని, శనివారం నాటికి సమస్య తీరిపోతుందన్నారు. ఈలోగా విధులలో జాయిన్ కావాలని చెప్పామని, శుక్రవారం నుంచి నీటి సరఫరా అవుతుందని చెప్పారు.

## పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన

**ప్రజాశక్తి అనకాపల్లి డెస్క్ :** గొలుగొండ మండలం పోలవరం గ్రామంలో అభయాంజనేయ ఆలయం నిర్మాణానికి జెడ్‌పిటిసి సుర్ల గిరిబాబు గురువారం శంకుస్థాపన చేశారు. వెంకటాపురంలో అదనపుగదులకు, జి కొత్తూరు అభయాంజనేయ స్వామి ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. సుమారు రూ. 6 కోట్లతో ఆరు గిరిజన గ్రామాలకు కలుపుకొని పప్పుశెట్టిపాలెం జంక్షన్ వరకు, రూ.4 కోట్ల 60 లక్షల నిధులు తారు రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. రూ.కోటి 35 లక్షలతో దొంకాడ గిరిజన గ్రామాలకు తారురోడ్డుకు శంకుస్థాపన చేశారు.

గొలుగొండ మండలం ఎల్లవరం పంచాయతీ రాజుపేట గ్రామం నుంచి శివారు దొంకాడ ఎస్టీ గ్రామానికి రూ.1.35లక్షలు నిధులతో 1.4 కిలోమీటర్ల మేర తారు రోడ్డు నిర్మాణానికి గొలుగొండ ఎంపిపి గజ్జలపు మణికుమారి, జెడ్‌పిటిసి సుర్ల గిరిబాబు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో ఎంపిపి మణికుమారి, ఎస్‌సి సెల్ జిల్లా అధ్యక్షులు లోచల సుజాత, పార్టీ అధ్యక్షులు లెక్కల సత్యనారాయణ, నడిమిపాలెం కన్వీనర్ కొరుప్రోలు పాణి శంకరాం, సీనియర్ నాయకులు మేడిశెట్టి వెన్నయ్య నాయుడు, గుండుపాల సర్పంచ్ జోగిరాజు, రామకృష్ణ, రాజుపేట ఎంపిటిసి పెదేడేమయ్య, అనిమిశెట్టి రమణ పాల్గొన్నారు.

**అనకాపల్లి డెస్క్:** రావికమతం మండలంలో గుడ్డిప గ్రామంలో తిరుమల తిరుపతి దేవస్థానం మాజీ చైర్మన్ వై.వి.సుబ్బారెడ్డి, చోడవరం ఎమ్మెల్యే ధర్మశ్రీ ప్రతిపాదనతో మంజూరైన, రూ. 10 లక్షలతో చేపట్టనున్న రామాలయ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసినట్లు సర్పంచ్ గుమ్మాల గణేశ్వరరావు తెలిపారు.

## హామీని నెరవేర్చిన 'బూడి'పై హర్షం

**ప్రజాశక్తి - మాడుగుల :** మాడుగులలో నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వంలో ఇచ్చిన హామీ మేరకు ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు స్థానిక రెల్లి వీధిలో పోలమాంబ గుడి నిర్మాణానికి నిధులు మంజూరు చేయడం, నిర్మాణ పనులు చురుగ్గా సాగడంపై స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మాట నిలబెట్టుకున్న ముత్యాలనాయుడుకు ధన్యవాదాలు తెలిపారు. మాడుగుల ఎంపిటిసి, వైసిపి మండల అధ్యక్షుడు వేమవరపు రామధర్మజ, సర్పంచ్ ఎడ్ల కళావతి, ఉప సర్పంచ్ ఐల్లాల వరహాలు, మార్కెట్ కమిటీ చైర్మన్ గొర్లి శ్రీనివాసరావు, వైసిపి టౌన్ ప్రెసిడెంట్ బొమ్మిశెట్టి శ్రీనివాసరావు, రెల్లి వీధి ప్రజలు పాల్గొన్నారు.

**గ్రామ పంచాయతీ కార్యాలయము - వేములపూడి**

రిఫ.నెం. 01-2024 తేదీ.14-03-2024

అనకాపల్లి జిల్లా, నర్సీపట్నం మండలం, వేములపూడి గ్రామ పంచాయితీ మరియు గ్రామం, శివారు గ్రామాల యందు గల PWS స్కీముల నిర్వహణ, ఫిల్టర్ల నిర్వహణ, పారిశుద్ధ్య సిబ్బంది మొదలగు వారిని కాంట్రాక్టు పద్ధతిపై సప్లయి చేయుటకుగాను తేది : 18-03-2024న ఉదయం 10గంటల నుండి మధ్యాహ్నం 1.00 గంట వరకు సీల్డు టెండర్లు స్వీకరించబడును. అదే రోజు మధ్యాహ్నం 3.00గంటలకు అందిన సమక్షంలో టెండర్లు తెరువబడును. [illegible] గ్రామపంచాయతీ కార్యాలయం, వేములపూడి నందు శ్రీ పంచాయతీ కార్యాలయం [illegible] నిర్ణయించబడును. [illegible] 3000.00 [illegible] చెల్లించవలెను.

సం/- పంచాయతీ కార్యదర్శి
గ్రామపంచాయితీ-వేములపూడి, నర్సీపట్నం మండలం.

# గంగవరం పోర్టు కాలుష్యంతో ఇబ్బందులు

### సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి జగ్గునాయుడు

**ప్రజాశక్తి -గాజువాక :** అదాని గంగవరం పోర్టు విడుదల చేస్తున్న కాలుష్యంతో గాజువాక పరిసర ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు చెప్పారు. సిపిఎం గాజువాక కార్యాలయంలో గురువారం ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, పోర్టు నిర్మాణం కోసం 3,000 ఎకరాలు తీసుకున్న యాజమాన్యం కనీస రక్షణ చర్యలు తీసుకోవడం లేదన్నారు. గంగవరం మత్స్యకారులకు తీవ్ర విఘాతం కలిగించేలా చర్యలు తీసుకుంటున్నారని, వారికి ఉపాధి కల్పించలేదని తెలిపారు. గంగవరం పోర్టు నుంచి గాజువాక వస్తున్న భారీ వాహనాల వల్ల మున్సిపల్ ఆఫీస్ రోడ్డు నిత్య రద్దీగా మారుతోందన్నారు. ఆ వాహనాలకు వేరే మార్గం చూడాలని సూచించారు. దీనిపై త్వరలో గంగవరం పోర్టు రోడ్డు వద్ద ఆందోళన చేయనున్నట్లు చెప్పారు.

సిపిఎం 78వ వార్డు కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు మాట్లాడుతూ, కాంగ్రెస్, సిపిఐ, సిపిఎం, జై భారత్ పార్టీ తరపున గాజువాక అసెంబ్లీ స్థానానికి సిపిఎం పోటీ చేస్తుందని తెలిపారు. మరో రెండు రోజుల్లో ప్రకటన వచ్చే అవకాశం ఉందన్నారు. గాజువాక రక్షణకు, స్టీల్‌ప్లాంట్‌ను కాపాడుకునేందుకు సిపిఎం అభ్యర్థిని ఎమ్మెల్యేగా గెలిపించాలని కోరారు. ఈ నెల 17వ తేదీన చిలకలూరిపేటలో తెలుగుదేశం జనసేన బిజెపి నిర్వహించే బహిరంగ సభలో స్టీల్‌ప్లాంట్‌ను ప్రయివేటీకరించబోమని చెప్పే దమ్ము మోడీకి ఉందా అని ప్రశ్నించారు. సిద్ధం అని చెప్పుకుంటున్న వైసిపి స్టీల్‌ప్లాంట్‌ను అమ్మటానికా సిద్ధమని ప్రశ్నించారు. ఈ పార్టీలకు స్టీల్‌ప్లాంట్‌పై చిత్తశుద్ధి లేదన్నారు. సిపిఎం గాజువాక జోన్ కార్యదర్శి ఎం.రాంబాబు మాట్లాడుతూ, గంగవరం పోర్టు నుంచి వెళ్తున్న వ్యాగన్లపై ఎలాంటి పరదాలు లేకుండా తరలిస్తుండటంతో గాజువాక ప్రాంతంలో తీవ్రకాలుష్యం ఏర్పడుతుందన్నారు. ఈ విలేకరుల సమావేశంలో సిపిఎం నాయకులు కెఎం.శ్రీనివాసరావు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎం.జగ్గునాయుడు

# 18 నుండి పదోతరగతి పరీక్షలు : డిఇఒ చంద్రకళ



**ప్రజాశక్తి - ఆరిలోవ :** పదో తరగతి పబ్లిక్ పరీక్షలు ఈ నెల 18 నుంచి 30వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి ఎల్.చంద్రకళ తెలిపారు. జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో గురువారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో పరీక్షలకు సంబంధించిన వివరాలను ఆమె వెల్లడించారు. జిల్లాలో 138 కేంద్రాల్లో 31,379 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకానున్నట్లు తెలిపారు. రెగ్యులర్ విద్యార్థులు 28,368 మంది, ప్రయివేటుగా 3012 మందికి హాల్ టికెట్లు కేటాయించామని వివరించారు. పరీక్షలు ఉదయం 9:30 నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు జరుగుతాయని తెలిపారు. పరీక్షకు హాజరయ్యే విద్యార్థులకు ఉచిత రవాణా సౌకర్యం కల్పిస్తున్నామన్నారు. అత్యవసర సమయాల్లో పరీక్షకు హాజరయ్యే విద్యార్థులకు 30 నిమిషాలు గ్రేస్ పీరియడ్ ఇస్తున్నట్లు చెప్పారు. వేసవి కారణంగా విద్యార్థుల ఆరోగ్యాలను దృష్టిలో పెట్టుకొని జిల్లా కలెక్టర్ పరీక్ష కేంద్రాల వద్ద ప్రాథమిక వైద్య కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నారని తెలిపారు. పరీక్ష హాజరయ్యే వారిలో 14,972 మంది బాలురు, 13,395 మంది బాలికలు ఉన్నారన్నారు. ఇంగ్లీష్ మీడియంలో 24,644 మంది, తెలుగు మీడియంలో 3,704 మంది, ఒరియా మీడియంలో 9 మంది, ఉర్దూ మీడియంలో 10 మంది పరీక్ష రాయనున్నారని వివరించారు. పదో తరగతి పరీక్షల నేపథ్యంలో సెల్ ఫోన్లు వినియోగంపై కఠిన ఆక్షలు విధించినట్లు తెలిపారు. పరీక్ష సిబ్బంది, స్క్వాడ్‌తో సహా, ఇతర అధికారులకూ ఈ నిబంధనలు వర్తిస్తాయని చెప్పారు.

# గీతంలో బయోమెడ్ భారత్-24 ప్రారంభం


**ప్రజాశక్తి -మధురవాడ :** గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలోని స్కూల్ ఆఫ్ టెక్నాలజీ, గీతం ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్స్ అండ్ రీసెర్చ్ (జిమ్సర్) సంయుక్తంగా నిర్వహిస్తున్న బయోమెడ్ భారత్-2024ను ఆంధ్రప్రదేశ్ మెడ్‌టెక్ జోన్ సిఇఒ డాక్టర్ జితేంద్రశర్మ గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతన ఆవిష్కరణల పట్ల ఆసక్తి గల యువతకు మెడ్‌టెక్ జోన్ ద్వారా మూడు నెలల ఇంటర్న్‌షిప్‌తో పాటు స్వయంగా కంపెనీ ఏర్పాటు చేసుకునేందుకు ఆర్థిక సహకారం అందిస్తామని చెప్పారు. ఏదైన నూతన వైద్య ఉపకరణాలను రూపొందించాలనుకునే యువత ముందుగా తమ నూతన డిజైన్‌తో పాటు దాని తయారీకి సంబంధించిన ముడి సరుకు లభ్యత, మార్కెటింగ్ అవకాశాలపై అధ్యయనం చేయాలని సూచించారు. వీలైతే ఒక మార్కెటింగ్ నిపుణుడిని సహితం తమ బృందంలో నియమించుకోవాలన్నారు. నూతన ఆవిష్కరణలను ప్రోత్సహించడానికి, మార్గదర్శకం చేయడానికి ఎపి మెడ్‌టెక్ జోన్ ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటుందన్నారు.

గీతం వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ దయానంద సిద్దవట్టం మాట్లాడుతూ, వైద్యరంగం అవసరాలను గుర్తించి నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని దేశీయంగా అభివృద్ధి చేయడానికి యువతను ప్రోత్సహించే ఉద్దేశంతో జాతీయ స్థాయిలో ఈ బయోమెడ్ హ్యాకథాన్‌ను నిర్వహిస్తున్నామని వెల్లడించారు. దేశంలోని గుర్తింపు పొందిన విద్యా సంస్థలలో ప్రస్తుతం పూర్తి కాలపు అండర్ గ్రాడ్యుయేట్, పోస్ట్ గ్రాడ్యుయేట్ కోర్సులు అభ్యసిస్తున్న వారు, పరిశోధక విద్యార్థులు ఈ హ్యాకథాన్ పోటీలలో పాల్గొన్నారని తెలిపారు. కార్యక్రమంలో ట్రాన్సిడెన్స్ మెడికల్ టెక్నాలజీస్ డైరెక్టర్ డాక్టర్ శ్యామ్‌పేరి, మెకానికల్ ఇంజినీరింగ్ విభాగం ప్రొఫెసర్ సిహెచ్.విజయశేఖర్, ప్రొఫెసర్ రవికిషోర్ తదితరులు పాల్గొన్నారు.

పోటీలలో 15వ తేదీన జరిగే ఫైనల్‌లో విజేతలను ఎంపిక చేసి ప్రథమ బహుమతిగా రూ.లక్ష, తరువాతి స్థానాలలో నిలచిన వారికి రూ.50వేలు చొప్పున నగదు బహుమతి అందించనున్నారు.

# మైదాన ప్రాంత గిరిజనులను ఐటిడిఎలో విలీనం చేయండి

- నేతలకు మొరపెట్టుకున్న కొండశిఖర చలిసింగం, లోసింగి గ్రామస్తులు, సిపిఎం నేతలు


నేతలకు సమస్యలను విన్నవిస్తున్న సిపిఎం నేతలు, ఆదివాసీలు

**ప్రజాశక్తి -కొత్తకోట :** మైదానప్రాంత గిరిజన గ్రామాలను ఐటిడిఎలో విలీనం చేయాలని, గ్రామాల్లోని మౌలిక సదుపాయాలను కల్పించి, ఇతర సమస్యలను పరిష్కరించాలని చీమలపాడు సర్పంచ్ గంగరాజుతోపాటు చలిసింగం గ్రామస్తులు వేడుకున్నారు గురువారం రాష్ట్ర ఎస్టీ కమిషన్ సభ్యుడు శంకర్ నాయక్ చోడవరం ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ తో కలసిచీమలపాడు పంచాయతీ శివారు కొండ శిఖరం గ్రామమైన చలిసింగం సందర్శించారు. గిరిజనులతో సమావేశమై, వారి సమస్యలు ఇబ్బందులు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా తమకు రహదారి, ఇతర సమస్యలను కల్పించాలని సర్పంచ్ వంజరి గంగరాజు వివరించారు. అత్యవసర పరిస్థితుల్లో వైద్యానికివెళ్లాలంటే నేటికీ డోలిమోతలే శరణ్యమౌతున్నాయని, తమ గోడు పట్టించుకునే దిక్కు లేదని వాపోయారు. శ్మశానవాటికకు స్థలం కేటాయించాలని కోరారు. దీనిపై నేతలు స్పందిస్తూ శ్మశానవాటిక స్థలాన్ని గుర్తించి పెన్సింగ్ వేసి అప్పగించాలని ఆర్‌డిఒ జయరామ్‌కు సూచించారు. ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ మాట్లాడుతూ ఈ పంచాయతీ పరిధిలోకొన్ని గ్రామాలలో తాగు నీరు, రహదారి సౌకర్యం కల్పించామన్నారు. చలిసింగం గ్రామరహదారికి నిధులు మంజూరు కాగా ప్రస్తుతం టెండర్ పనులు పూర్తయ్యాయన్నారు. ఈ సందర్భంగా రూ.18 లక్షలతో నిర్మించిన వాటర్ ట్యాంక్‌ను ఎమ్మెల్యే ధర్మశ్రీ ప్రారంభించారు. ఎంపిపి పైల రాజు, ఎంపిటిసి సభ్యులు పూడి దేవ, సర్పంచ్ వంజరి గంగరాజు, అధికారులు పాల్గొన్నారు

**లోసింగి గ్రామసమస్యలను పరిష్కరించాలి: సిపిఎం నేతలు**

**రోలుగుంట:** రోలుగుంట మండలం కొండశిఖర గ్రామమైన లోసింగి గ్రామంలో సమస్యలను పరిష్కరించాలని సిపిఎం నేతలు కోరారు. గురువారం ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ, ఎస్టీ కమిషన్ మెంబర్ శంకర్‌నాయక్, నర్సీపట్నం ఆర్డీవో జయరాం గ్రామంలో పర్యటించారు. ఈ సందర్భంగా గడప గడపకు ప్రభుత్వం కార్యక్రమంలో రోడ్డు వేస్తామని ఇచ్చిన హామీ ఏమైందని ప్రభుత్వ విప్ ధర్మశ్రీని ప్రశ్నించారు. దీంతో ధర్మశ్రీ సమాధానం దాటవేశారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు కె గోవిందరావు మాట్లాడుతూ లోసింగ్ గ్రామంలో 70 కుటుంబాలు పివిజిజి కొందు ఆదివాసి గిరిజనులు జీవిస్తున్నారని, వీరికి కొత్త రేషన్‌కార్డులు, ఆధార్ కార్డులు, మ్యారేజ్ సర్టిఫికెట్లు, అంగన్వాడీకేంద్రం, రోడ్డు సౌకర్యం ఇలా అన్నీ సమస్యలేనని, వాటి పరిష్కారానికి చర్యలు చేపట్టాలన్నారు. గ్రామంలో ఆశా కార్యకర్త లేకపోవడంతో గర్భిణులు ఇబ్బందులు పడుతున్నారని, సాధారణ వైద్యానికి సైతం ఆరుకిలోమీటర్ల దూరం వెళ్లాల్సివస్తోందని, ఇక అత్యవసరమైతే డోలి మోతలే గతి అన్నారు. ప్రభుత్వ విప్ ధర్మశ్రీ కారు ముందు డోలి మోతతో నిరసన తెలిపారు. కార్యక్రమంలో కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి ఈరెల్లి చిరంజీవి, గ్రామస్తులు కిలో సుందరరావు పాల్గొన్నారు.

# వైసిపి పాలనలో రాష్ట్రం సర్వనాశనం

- శంఖారావ ప్రచార సభలో మాజీ మంత్రి అయ్యన్నపాత్రుడు

**ప్రజాశక్తి- అనకాపల్లి డెస్క్ :** వైసిపి పాలనలో రాష్ట్రం సర్వనాశనం అయిందని మాజీ మంత్రి చింతకాయల అయ్యన్నపాత్రుడు ఆరోపించారు. బుధవారం రాత్రి నర్సీపట్నం మండలం ధర్మసాగరం గ్రామంలో శంఖారావం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అయ్యన్నపాత్రుడు మాట్లాడుతూ రాష్ట్రం అభివృద్ధిలో కుంటుపడిందని, కనీసం రోడ్ల గుంతలు పూడ్చలేని దుస్థితి ఉందన్నారు. సీఎం జగన్ అసమర్థ ముఖ్యమంత్రి అని, మద్యం దుకాణాలను తాకట్టుపెట్టారన్నారు. రైల్వే జోన్, ప్రత్యేక హోదా తీసుకువస్తానని బీరాలు పలికి, అధికారంలోకి వచ్చిన తర్వాత చేతులెత్తేశారన్నారు. రాష్ట్రం మళ్లీ అభివృద్ధి బాటలో పయనించాలంటే టిడిపి, జనసేన ఉమ్మడి ప్రభుత్వం అధికారంలోకి రావాల్సిన అవసరం ఉందన్నారు. జెడ్‌పిటిసి సుకల రమణమ్మ, జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి సూర్యచంద్ర, మండల పార్టీ అధ్యక్షులు లాలం శ్రీరంగస్వామి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాజీ మంత్రి చింతకాయల అయ్యన్నపాత్రుడు

## కింతలిలో ఆధార్ సేవా కేంద్రం

**ప్రజాశక్తి - మాడుగుల:** మండలంలోని కింతలి గ్రామపంచాయతీ భవనంలో గురువారం ఆధార్ నమోదు కేంద్రం ఏర్పాటు చేశారు. కింతలి సర్పంచ్ ఎం. సన్యాసిరావు కృషితో ఎంపిడిఒ చొరవ చూసి దీన్ని ఏర్పాటు చేశారు. ఈ కేంద్రంలో కొత్త ఆధార్ నమోదు, ఆధార్‌కు ఫోన్ నెంబర్ అనుసంధానం, చిరునామా మార్పిడి, బయోమెట్రిక్ ఇతర అన్ని సేవలు అందుబాటులో ఉంటాయన్నారు. అందుబాటులో ఉన్న ఈ కేంద్రాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ కోరారు.

## వరి కుప్పలు, జీడితోట దగ్ధం

**ప్రజాశక్తి- అనకాపల్లి డెస్క్ :** గొలుగొండ మండలం జోగుంపేట పంచాయతీ శివారు కంసాలిబంద గ్రామంలో గురువారం ఉదయం అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. జువ్వల నారాయణకు చెందిన వరి కుప్పలు, సరుగుడు తోట దగ్ధమైంది. దీంతో రూ.5లక్షల మేర నష్టం వాటిల్లిందని బాధిత రైతు వాపోయాడు. ప్రభుత్వం తమను ఆదుకోవాలని కోరుతున్నారు.

## టిడిపి కార్యాలయం ప్రారంభం

**ప్రజాశక్తి- హుకుంపేట:** మండల కేంద్రంలో తెలుగుదేశం పార్టీ కార్యాలయాన్ని గురువారం టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి సివేరి దొన్ను దొర పార్టీ శ్రేణులు కలిసి ప్రారంభించారు. అనంతరం మట్టు జోరు, తీగలవలస తదితర పంచాయతీల్లో పర్యటించి బాబు ష్యూరిటీ భవిష్యత్ గ్యారంటీ, సూపర్ సిక్స్ పథకాలను ప్రచారం చేశారు. టిడిపి అధికారంలోకి వస్తే చంద్రబాబు హయాంలోనే జారీచేసిన జిఒ 3 పునరుద్ధరణకు చర్యలు తీసుకుంటామని హామీనిచ్చారు. టిడిపి మండల అధ్యక్షుడు కొర్ర తులసిరావు, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## తక్కువ బరువు పిల్లలపై ప్రత్యేక దృష్టి

**ప్రజాశక్తి -హుకుంపేట :** బరువు తక్కువగా ఉన్న పిల్లలపై ప్రత్యేకదృష్టి సారించాలని ఐసిడిఎస్ ప్రాజెక్ట్ అధికారి ఎన్. సూర్యలక్ష్మి అంగన్వాడీలను ఆదేశించారు. హుకుంపేట ఐసిడిఎస్ ప్రాజెక్ట్ రంగసీల, బారపల్లి అంగన్వాడీ కేంద్రాలలో పోషణ పక్వాడా కార్యక్రమంలో మాట్లాడుతూ, చిరుధాన్యాల ప్రయోజనాలు, పోషకారం, పరిశుభ్రత, బాల్య వివాహాల అనర్థాలపై అవగాహన కల్పించారు.

## శ్రీభరత్ ప్రచారానికి కోరాడ దూరం

**ప్రజాశక్తి -భీమునిపట్నం :** టిడిపి విశాఖ లోక్‌సభ స్థానం టికెట్ ఆశిస్తున్న ఎం.శ్రీభరత్ ఎంచుకున్న ముహూర్తం ప్రకారం భీమిలి మండలం తాళ్లవలస నుంచి బుధవారం ప్రచారానికి శ్రీకారం చుట్టారు. అయితే భీమిలి అసెంబ్లీ స్థానం నుంచి టికెట్ ఆశిస్తున్న పార్టీ నియోజక వర్గ ఇంఛార్జి కోరాడ రాజబాబు, అతని అనుచరగణం భరత్ వెంట లేకపోవడంతో పార్టీలో పెద్ద చర్చే నడుస్తోంది. కష్టకాలంలో పార్టీని నడిపించిన కోరాడకు టిక్కెట్ ఇవ్వకుంటే పార్టీ గెలుపునకు పనిచేసేది లేదని ఇప్పటికే పార్టీ రాష్ట్ర అధ్యక్షులు కింజరాపు అచ్చెన్నాయుడుకు, విశాఖ పార్లమెంటరీ నియోజకవర్గ అధ్యక్షులు ఎం.శ్రీభరత్‌కు కోరాడ అనుచరులు తెగేసి చెప్పినట్టు సమాచారం. దీంతో పార్టీ అధిష్టానం ఎటూ తేల్చుకోలేని పరిస్థితిలో ఉంది. భీమిలి అసెంబ్లీ సీటు కోసం మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావు కూడా తీవ్రంగా ప్రయత్నాలు చేస్తున్న విషయం తెలిసిందే. గంటాను విజయనగరం జిల్లా చీపురుపల్లిలో పోటీకి నిలపాలని అధిష్టానం స్పష్టం చేసింది. చీపురుపల్లి వెళ్లేందుకు ఆయన ఆశక్తి చూపలేదు. తనకు భీమిలిలో సీటు ఇవ్వాలని ఒత్తిడి పెంచుతున్నారు. తాజాగా ఇక్కడ సీటు విజయనగరం జిల్లా, నెల్లిమర్ల నియోజకవర్గం టిడిపి ఇంచార్జి కర్రోతు బంగార్రాజు పేరును పార్టీ అధిష్టానం తాజాగా తెరపైకి తీసుకొచ్చింది. ఇతను నెల్లిమర్ల సీటును ఆశించగా, పొత్తులో భాగంగా ఆ సీటు జనసేనకు కేటాయించారు. దీంతో అధిష్టానంపై గుర్రుగా ఉన్న బంగార్రాజును సంతృప్తి పరిచేందుకు భీమిలి సీటును కేటాయిస్తే ఎలా ఉంటుందనే ఆలోచనలో పడ్డ అధిష్టానం అభిప్రాయ సేకరణ చేసింది. భీమిలిలో పోటీకి బంగార్రాజు ఆశక్తి చూపడం లేదని సమాచారం. భీమిలి టికెట్ కోరాడకు కేటాయించేందుకు ఎక్కువ అవకాశాలు ఉన్నట్టు సమాచారం.

## ముఖ్యమంత్రి సహాయనిధి అందజేత

**ప్రజాశక్తి -ములగాడ :** ఇటీవల కాలేయ మార్పిడి శస్త్రచికిత్స చేయించుకున్న అల్లబోయిన గిరీష్ కుటుంబానికి ముఖ్యమంత్రి సహాయనిధి రూ.15 లక్షలను బాధితుని తల్లి రమణమ్మకు పశ్చిమ నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో గిరీష్ శస్త్రచికిత్స చేయించుకున్నారని, సుమారు రూ.కోటి ఖర్చు అయినట్లు కార్పొరేటర్ పూర్ణశ్రీ, సురేష్ యాదవ్ తన దృష్టికి తీసుకురావడంతో సిఎం రిలీఫ్ ఫండ్ నుంచి ఈ మొత్తాన్ని అందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ రేవల్ల సత్యనారాయణ పాల్గొన్నారు.

## పెందుర్తి స్థానాన్ని కాపులకు కేటాయించాలి

**ప్రజాశక్తి-పెందుర్తి :** పెందుర్తి అసెంబ్లీకి వైసిపి సీటును కాపు సామాజిక వర్గానికి కేటాయించాలని వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ గుంటూరు నరసింహమూర్తి కోరారు. నియోజకవర్గంలో కాపు సామాజిక వర్గం అత్యధికంగా ఉన్నారని తెలిపారు. గతంలో ఈటి నాగయ్య, సాలాపు అప్పలనాయుడు, గుడివాడ అప్పన్న, గుడివాడ గురునాథరావు, ప్రజారాజ్యం నుంచి పంచకర్ల రమేష్ బాబును అత్యధిక మెజార్టీతో కాపులు గెలిపించారని గుర్తు చేశారు. ఈ విషయాన్ని దృష్టిలో పెట్టుకొని జగన్మోహన్‌రెడ్డి ఆలోచించి పెందుర్తిని కాపులకే కేటాయించాలని కోరారు.

## ఉరుకూటిని కలిసిన అమర్‌నాథ్

**ప్రజాశక్తి -గాజువాక :** గాజువాక సమన్వయకర్తగా నియమితులైన రాష్ట్ర మంత్రి గుడివాడ అమర్‌నాథ్ ఇప్పటివరకు సమన్వయకర్తగా ఉన్న ఉరుకూటి రామచంద్రరావు (చందు) ఇంటికి గురువారం వెళ్లి కలిశారు. సుమారు మూడు గంటల పాటు మంతనాలు జరిపారు. పార్టీ సమన్వయకర్తగా తనను ప్రకటించడంతో నెల రోజుల వ్యవధిలో నియోజకవర్గంలో అందరినీ కలుపుకొని వెళ్లానని, సొంత నిధులు చాలా ఖర్చు అయ్యాయని అమర్‌నాథ్ వద్ద ఉరుకూటి చందు ఆవేదన వ్యక్తంచేశారు. తిప్పల నాగిరెడ్డి కుటుంబానికి భయపడి తన సీటు మార్చారా అని ప్రశ్నించారు. పార్టీ తగు న్యాయం చేస్తుందని చెబుతూ మంత్రి అక్కడి నుంచి బయలుదేరి అనకాపల్లి వెళ్లారు.

## శ్రమ ఆయుధమైతే విజయం బానిస అవుతుంది

**ప్రజాశక్తి -ములగాడ :** శ్రమ ఆయుధమైతే విజయం మన బానిస అవుతుందని విశాఖ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కొండా రాజీవ్‌గాంధీ అన్నారు. ప్రకాష్‌నగర్ శాఖా గ్రంథాలయంలో సెయింట్ ఆన్స్ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ - 2 ఆధ్వర్యాన నిర్వహిస్తున్న ప్రత్యేక సేవా శిబిరం ముగింపు సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. అవమానాలను సహించి, చిరునవ్వుతో ప్రజాసేవకు అంకితమైన వాడే నిజమైన నాయకుడన్నారు. గౌరవ అతిథి డాక్టర్ ఎస్.హరినాథ్ మాట్లాడుతూ, విద్యార్థి దశ నుంచి సేవా కార్యక్రమాలు చేయడం వల్ల వ్యక్తిత్వం వికసిస్తుందన్నారు. కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ జిల్లా ప్రోగ్రాం అధికారి ఇపిఎస్.భాగ్యలక్ష్మి, గ్రంథాలయాధికారి అజయ్‌కుమార్, రచయిత కె.సత్తిరాజు, గాజువాక, పెందుర్తి, సబ్బవరం శాఖా గ్రంథాలయ అధికారులు చంద్రకళ, సూర్య కళ, శిరీష ప్రసంగించారు. అనంతరం వివిధ పోటీలలో గెలుపొందిన వాలంటీర్లకు బహుమతులను అందజేశారు.

## రాజుపేట విఆర్ఒ అకాల మరణం

- దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన సహచర సిబ్బంది


లాలం సూరిబాబు (ఫైల్‌ఫొటో)

**ప్రజాశక్తి-కోటవురట్ల :** మండలంలో రాజుపేట సచివాలయ విఆర్ఒ లాలం సూరిబాబు గురువారం అకాల మరణం పొందారు. పక్షం రోజులుగా మెదడుకు సంబంధించిన వ్యాధితో బాధపడుతూ, విశాఖలో చికిత్స పొందుతున్న సూరిబాబు మృతితో కుటుంబ సభ్యులు, సహా సహచర సిబ్బందిలో విషాదఛాయలు అలముకున్నాయి. మాకవరపాలెం మండలం శెట్టివానిపాలెం గ్రామానికి చెందిన లాలం సూరిబాబు చిన్న వయసులోనే ఈనాడు విలేకరిగా నర్సీపట్నం, మాకవరపాలెం మండలాల పరిధిలో తనదైన ముద్ర వేసుకుంటూ ప్రజా సమస్యలను పత్రిక ద్వారా వెలుగులోకి తెచ్చి విశేషకృషి చేశారు. ఇటీవల రాజుపేట సచివాలయ గ్రామ రెవిన్యూ అధికారిగా బాధ్యతలు చేపట్టారు. రామన్నపాలెం, సుంకాపూర్, జల్లూరు, రెవెన్యూ గ్రామాలకు అధికారిగా విశిష్ట సేవలు అందించారు, అనేక సమస్యలను పరిష్కరించడంతోపాటు సిబ్బందితో మమేకమై ప్రజల మన్ననలు పొందారు. అందరితో కలివిడిగా ఉంటూ, సహచర సిబ్బందికి విధి నిర్వహణలో సహకరిస్తూ ప్రధాన భూమిక పోషించారు. సేవా నిరతి ఉన్న వ్యక్తిని కోల్పోవడంపై కుటుంబ సభ్యులతో సహా సిబ్బంది తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు, సూరిబాబు అకాల మరణంపై స్థానిక తహశీల్దారు వెంకటరమణ, ఉపతహశీల్దారు అన్నాజీరావు, విఆర్ఒలు, సిబ్బంది సంతాపం వ్యక్తంచేస్తూ, సూరిబాబు కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

## కార్ల్ మార్క్స్‌కు ఘననివాళి


నివాళులర్పిస్తున్న సిపిఎం నాయకులు

**ప్రజాశక్తి- నక్కపల్లి:** స్థానిక సిఐటియు కార్యాలయం వద్ద గురువారం కార్ల్ మార్క్స్ 141వ వర్ధంతి నిర్వహించారు. కార్ల్ మార్క్స్ చిత్రపటానికి సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎం.అప్పలరాజు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రపంచ మేధావి, కష్టజీవులకు అండగా కమ్యూనిస్టు ప్రణాళిక రచించి, సమసమాజం స్థాపనకు మార్గాన్ని చూపించి, పెట్టుబడిదారులకు సింహం స్వప్నంగా కార్ల్ మార్క్స్ నిలిచారన్నారు. పోరాడితే పోయేది ఏముంది బానిస సంకెళ్లు తప్ప అని కార్మిక వర్గానికి దిశానిర్దేశం చేసి గొప్ప యోధుడు మార్క్స్ అని కొనియాడారు. మార్క్స్ ఆశించిన సమసమాజం స్థాపనకు అందరం కృషి చేద్దామన్నారు. కార్యక్రమంలో నాయకులు సోమేశ్వరరావు, మహేష్ బాబు, సోమేష్, నూకరాజు, రమణ పాల్గొన్నారు.

## గ్రామాల్లో కేంద్ర పోలీసు బలగాల కవాతు

**ప్రజాశక్తి -కొత్తకోట :** రానున్న సార్వత్రిక ఎన్నికలలో ప్రజలు తమ ఓటు హక్కును ప్రశాంతంగా వినియోగించుకోవాలని కొత్తకోట సీఐ అప్పలనాయుడు తెలిపారు. గురువారం సర్కిల్ పరిధిలో కొత్తకోట, మర్రివలస, వొమ్మవరం, కన్నంపేట, టి. అర్జాపురం, గంపవానిపాలెం తదితర గ్రామాలలో కేంద్ర పోలీస్ బలగాలు, స్థానిక పోలీసులతో కలిసి ప్రశాంత ఎన్నికలకు భరోసానిస్తూ పోలీస్ కవాతు నిర్వహించారు. ప్రజలు ఎలాంటి ప్రలోభాలకు గురికాకుండా నిర్భయంగా ఓటుహక్కును వినియోగించు కోవచ్చునన్నారు. ఎన్నికల సందర్భంగా ఏలాంటి గొడవలకు అవకాశం ఇవ్వొద్దని హితవు పలికారు. శాంతియుత వాతావరణంలో ఎన్నికలు జరగడానికి సహకరించాలని కోరారు. కొత్తకోట ఎస్సై లక్ష్మణ రావు, సిబ్బంది పాల్గొన్నారు...

## కలప అక్రమ రవాణాపై ప్రత్యేక నిఘా :డిఎఫ్ఒ

**ప్రజాశక్తి-అనకాపల్లి డెస్క్ :** కలప అక్రమ రవాణాపై ప్రత్యేక నిఘా పెట్టామని నర్సీపట్నం డీఎఫ్ఓ జగన్నాధం సింగ్ అన్నారు. గురువారం గొలుగొండ మండలం కృష్ణదేవిపేట అటవీ కార్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అనుమతులు లేకుండా కలప తరలించిన వారిపై చట్టపరమైన చర్యలు తప్పవన్నారు. చెక్ పోస్టుల వద్ద ప్రత్యేక నిఘా పెడతామన్నారు. . గతంలో నిలుపుదల చేసిన సీపీజి పద్ధతి కొనసాగించేలా చర్యలు తీసుకుంటామని, కార్పెంటర్ తయారు చేసిన పర్నిచర్‌ను సీపీజీతోనే తరలించాలన్నారు. రేంజర్ వెంకట్రావు ఉన్నారు.

## త్వరలోనే కాంగ్రెస్ అభ్యర్థులను ప్రకటిస్తాం : గిడుగు

**ప్రజాశక్తి-సీతమ్మధార :** త్వరలోనే కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను ప్రకటిస్తామని పిసిసి అధ్యక్షులు గిడుగు రుద్రరాజు చెప్పారు. పౌర గ్రంథాలయంలో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏపీలో 175 అసెంబ్లీ నియోజకవర్గాలకు, 25 పార్లమెంటు స్థానాలకు 1,350 దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులతో పిసిసి అధ్యక్షురాలు షర్మిల మాట్లాడారని చెప్పారు. చాలా మంది నాయకులు కాంగ్రెస్ పార్టీలో టచ్‌లో ఉన్నారని, వైఎస్.వివేకానందరెడ్డి కుటుంబం కాంగ్రెస్ పార్టీలోకి వస్తే స్వాగతిస్తామని తెలిపారు. స్టీల్‌ప్లాంట్‌పై డిక్లరేషన్ కోసం ఈ నెల 16న తేదీన సాయంత్రం ఉక్కునగరంలోని తృష్ణ మైదానంలో బహిరంగసభ నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈ సభకు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హాజరవుతారని తెలిపారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణను కాంగ్రెస్ పూర్తిగా వ్యతిరేకిస్తోందన్నారు. అదానీ, అంబానీల కోసం మోడీ దేశాన్ని ధారాదత్తం చేస్తున్నారని ఆరోపించారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు గొంప గోవిందరాజు, రాకేశ్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## చాకలిపేటలో జివిఎంసి పార్కు ప్రారంభం

**ప్రజాశక్తి-సీతమ్మధార :** జివిఎంసి 26వ వార్డు పరిధి చాకలిపేట సంకువానిపాలెంలో రూ.16.30 లక్షలతో నిర్మించిన పార్కును వార్డు వైసిపి ఇన్‌ఛార్జి పీలా వెంకటలక్ష్మి సమక్షంలో ఉత్తర నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త కెకె.రాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా మెయిన్‌స్ట్రీమ్ ప్రజలు, సీనియర్ సిటిజన్స్ కోసం పార్కు నిర్మించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి కార్పొరేటర్ ముక్క శ్రావణి, బొడ్డేటి కిరణ్, రేవతిరావు, ముక్కా కిషోర్ కుమార్, శేషు, రవిబాబు, పాండవ శ్రీను, పి.రాము, అమ్మాజీ, నవాబ్, వై.చిన్న, రమాదేవి, సుశీల, గౌశ్య గుణ తదితరులు పాల్గొన్నారు.

## సనపలకు శుభాకాంక్షలు

**ప్రజాశక్తి-మాధవధార :** విఎంఆర్‌డిఎ చైర్మన్‌గా నియమితులైన సనపల చంద్రమౌళిని అంతర్జాతీయ మానవ హక్కుల సంఘం ఆంధ్రప్రదేశ్ ప్రతినిధి బృందం అధ్యక్షులు పప్పల రామమోహనరావు తదితరులు మర్యాదపూర్వకంగా కలుసుకొని శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా విశాఖ నగర అభివృద్ధి, విస్తరణ ప్రణాళికలు, ప్రజా సమస్యలను గురించి చర్చించారు. అక్రమ లే-అవుట్లు, అక్రమ నిర్మాణాల విషయంలో కఠినంగా వ్యవహరించాలని చంద్రమౌళికి రామమోహనరావు విజ్ఞప్తి చేశారు. సామాన్య ప్రజల సొంత ఇల్లు మంజూరు ప్రక్రియను సరళతరం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు వి.నాగభూషణరావు, కార్యదర్శి పప్పల శ్రీహరి, జిల్లా అధ్యక్షులు పి.మల్లేశ్వరరావు, రాష్ట్ర మహిళా ఉపాధ్యక్షులు గాయత్రి, కార్యదర్శి బి.హైమావతి తదితరులు పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రి రాజీనామా చేయాలి : గణబాబు

**ప్రజాశక్తి -యంత్రాంగం**

**గోపాలపట్నం :** గ్రూప్-1 ఉద్యోగాలు అమ్ముకున్న ముఖ్యమంత్రి రాజీనామా చేయాలని పశ్చిమ నియోజకవర్గం ఎమ్మెల్యే పెతకంశెట్టి గణబాబు డిమాండ్ చేశారు. ఏపిపిఎస్‌సిలో అవినీతి, అక్రమ నియామకాల ఆరోపణలపై ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఎమ్మెల్యే గణబాబు ఆధ్వర్యాన గోపాలపట్నంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మెయిన్స్‌ను హైకోర్టు రద్దుచేసిందని, దీన్ని బట్టి ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ఎంత అవినీతికి పాల్పడ్డారో రాష్ట్ర ప్రజలు గ్రహించాలని కోరారు. పబ్లిక్ సర్వీస్ కమిషన్‌లో ఇలాంటి అవకతవకలు జరగడం రాష్ట్ర ప్రజలకే కాకుండా భారతదేశానికే అవమానమన్నారు. రూ.150 కోట్లకుపైగా లంచాలు తీసుకొని ఉద్యోగాలను అమ్ముకున్న ముఖ్యమంత్రితోపాటు గౌతమ్‌సవాంగ్ కూడా రాజీనామా చేసి క్షమాపణలు చెప్పాలని డిమాండ్‌చేశారు. ఈ నియామకాల్లో ఉద్యోగాలు పొంది విధి నిర్వహణలో ఉన్న 162 మంది పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. లంచాలు తీసుకొని ఉద్యోగాలు ఇచ్చిన అవినీతి ముఖ్యమంత్రిని గద్దెదించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టిడిపి కార్పొరేటర్ బొమ్మిడి రమణ, టిడిపి, జనసేన నాయకులు పాల్గొన్నారు.

**గాజువాక :** ఏపిపిఎస్‌సి పరీక్షల్లో నిరుద్యోగులను దగా చేసిన ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి, ఎపిపిఎస్‌సి చైర్మన్ గౌతమ్‌సవాంగ్, కార్యదర్శి రామాంజనేయులుపై సిబిఐతో దర్యాప్తు జరిపించాలని గాజువాక టిడిపి, జనసేన, బిజెపి ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి పల్లా శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. పాత గాజువాక జంక్షన్లో గురువారం తెలుగుదేశం శ్రేణులతో బైఠాయించరు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పరీక్షల నిర్వహణలో, మూల్యాంకనంలో పారదర్శకత పాటించకుండా, అవినీతికి పాల్పడి రూ.150 కోట్ల కుంభకోణం చేసి దేశ స్థాయిలో రాష్ట్ర పరువు తీశారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు పల్లా శ్రీనివాసరావు, రౌతు శ్రీనివాసరావు, మొల్లి ముత్యాల నాయుడు, పులి లక్ష్మీబాయి తదితరులు పాల్గొన్నారు.

# వైఎస్ఆర్ ఇబిసి నేస్తం నిధులు జమ

**ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ :** వైఎస్ఆర్ ఇబిసి నేస్తం పథకం కింద జిల్లాలోని 8,302 మంది పేద మహిళల ఖాతాల్లో రూ.12.45 కోట్లను జమ చేసినట్లు జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్ తెలిపారు. వైఎస్ఆర్ ఇబిసి నేస్తం మూడో విడత నిధులను రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి గురువారం నంద్యాల జిల్లా బనగానపల్లె నుంచి మీట నొక్కి ఒక్కొక్కరికీ రూ.15 వేలు చొప్పున విడుదల చేయగా విశాఖ కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో జరిగిన జిల్లా స్థాయి కార్యక్రమంలో జెసితో పాటు బిసి కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఆర్.ప్రసాద్, ఇతర అధికారులు వర్చ్యువల్ విధానంలో పాల్గొన్నారు.

**అనకాపల్లి జిల్లాలో 3664 మందికి...**

**అనకాపల్లి :** అనకాపల్లి జిల్లాలో వై.ఎస్.ఆర్. ఇ.బి.సి. నేస్తం కింద 3వ విడతలో జిల్లాలో 3664 మంది ఓబిసి మహిళా లబ్ధిదారుల ఖాతాల్లోకి రూ.5కోట్ల 49లక్షల 60వేలు ప్రభుత్వం విడుదల చేసిందని జిల్లా కలెక్టర్ రవి పట్టన్ శెట్టి తెలిపారు. నంద్యాల జిల్లా బనగానపల్లి నుంచి ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్మోహన్ రెడ్డి ఇబిసి నేస్తంను ప్రారంభించగా, అనకాపల్లి కలెక్టరు కార్యాలయ వీడియో కాన్ఫరెన్స్ హాలు నుంచి ప్రత్యక్ష ప్రసారం ద్వారా జిల్లా కలెక్టరుతో పాటు అధికారులు, లబ్ధిదారులు తిలకించారు. అనంతరం జిల్లాలోని లబ్ధిదారులకు నమూనా మెగా చెక్కును జిల్లా కలెక్టర్ అందజేశారు. కార్యక్రమంలో డిఆర్‌డిఎ పిడి శచీదేవి, గ్రామ వార్డు సచివాలయాల ప్రత్యేకాధికారి మంజులవాణి, బిసి కార్పొరేషన్ ఎఈఓ రవణమ్మ పాల్గొన్నారు.



నమూనా చెక్‌ను అందజేస్తున్న అనకాపల్లి జిల్లా కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి

**అల్లూరి జిల్లాలో 576 మందికి రూ.86.40 లక్షల లబ్ధి**

**పాడేరు:** అల్లూరి జిల్లాలో ఇబిసి నేస్తం పథకం కింద మూడవ విడతలో 576 మందికి రూ,86.40 లక్షల లబ్ధి చేకూరినట్లు జిల్లా కలెక్టర్ విజయసునీత తెలిపారు. కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాలు నుంచి జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఇబిసి నేస్తం పథకం ద్వారా మొదటి విడతలో 21 మంది లబ్దిదారులకు రూ.3.15 లక్షలు, రెండవ విడతలో 618 మంది లబ్దిదారులకు రూ.92.70 లక్షలు అందించగా, ప్రస్తుతం మూడవ విడతలో రూ.576 లబ్దిదారులకు రూ.86.40 లక్షలు లబ్ది చేకూరిందన్నారు. ఈ మేరకు లబ్దిదారులకు నమూనా చెక్కును జిల్లా కలెక్టర్ ఎం. విజయ సునీత పంపిణీ చేశారు.కార్యక్రమంలో డిఆర్‌డిఎ పీడీ వి.మురళి, బి.సి కార్పొరేషన్ ఎఇఒ కె. శంకరరావు పాల్గొన్నారు.

# రిజిస్ట్రేషన్ ఇళ్ల పట్టాల పంపిణీ



పట్టాలు అందజేస్తున్న కార్పొరేటర్ అక్కరమాని రోహిణి రామన్

ప్రజాశక్తి-యంత్రాంగం

**జగనన్న ఇళ్ల స్థలాలకు సంబంధించి రిజిస్ట్రేషన్ చేసిన ఇళ్ల పట్టాలను పలుచోట్ల గురువారం పంపిణీచేశారు.**

**సీతమ్మధార :** ఉత్తర నియోజకవర్గంలోని 41, 42, 43వ వార్డులకు సంబంధించిన లబ్ధిదారులకు డిప్యూటీ మేయర్ కట్టుమూరి సతీష్, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ కంపా హనుక్, కార్పొరేటర్లు కె.అనీల్‌కుమార్ రాజు, ఆళ్ల లీలావతి, పి.ఉషశ్రీ ఆధ్వర్యాన ఇళ్ల రిజిస్ట్రేషన్ పత్రాలను నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త కెకె.రాజు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కెకె.రాజు మాట్లాడుతూ, పేదల సొంతింటి కలను సాకారం చేయటమే ఈ ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో కో -ఆప్షన్ మెంబర్ సేనాపతి అప్పారావు, పైడి రమణ, ఎపిడి పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

జివిఎంసి 44వ వార్డుకు సంబంధించిన 1236 మంది లబ్ధిదారులకు ఇళ్ల రిజిస్ట్రేషన్ పట్టాలను ఫ్లోర్ లీడర్ బాణాల శ్రీనివాసరావు ఆధ్వర్యాన కెకె.రాజు పంపిణీచేశారు. ఈ కార్యక్రమంలో 43 వార్డు కార్పొరేటర్ ఉషశ్రీ, హబీబ్, బాణాల తరుణ్, ఎపిడి పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

**ఆరిలోవ :** 12వ వార్డు పరిధిలో 792 మంది ఇళ్ల లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్ పట్టాలను ఆరిలోవ కాలనీ సచివాలయం నెంబరు -2లో వార్డు కార్పొరేటర్ అక్కరమాని రోహిణిరామన్ అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి పేదల సొంతింటి కల నెరవేర్చారన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు అర్జున్, మోహన్, సంతోష్, శ్రీను, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

**అనకాపల్లి :** జివిఎంసి 84వ వార్డు వైసిపి ఇంచార్జ్ కోరుకొండ రాఘవ ఆధ్వర్యంలో సుమారు 500 మంది పేదలకు ఇంటి పట్టాలను గురువారం వైసిపి నియోజకవర్గం ఇన్‌ఛార్జి మలసాల భరత కుమార్ చేతుల మీదగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కోట్ని వీధిలో 30 మంది మహిళలు కార్యకర్తలు వైసిపిలో చేరారు. వారికి భరత్ కుమార్ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు జాజుల రమేష్, కడిమిశెట్టి సతీష్, మాధురి నాయుడు, అప్పికొండ రవిశంకర్, కోరుకొండ అప్పలసూరి, కోరుకొండ రమేష్, కరుకొండ కన్న, పిల్లల శివ అప్పారావు, పైడిరాజు, కేశిరెడ్డి ప్రసాద్ పాల్గొన్నారు.

**అనకాపల్లి డెస్క్ :** ఎస్ రాయవరం మండలం కొరుప్రోలులోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గురువారం సాయంత్రం జగనన్న ఇళ్ళ లబ్ధిదారులకు పాయకరావుపేట ఎమ్మెల్యే, రాజ్యసభ సభ్యుడు గొల్లబాబూరావు పట్టాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలో అర్హులైన ప్రతి పేదవాడి సొంతింటి కలను నెరవేర్చిన ఘనత ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డికే చెందుతుందన్నారు. కార్యక్రమంలో తహశీల్దారు జయలక్ష్మి, విఆర్ఒ శ్రీధర్ వైసిపి నేతలు చేకూరి రామచంద్రరాజు, శ్రీపతిరాజు, పోలిశెట్టి పెదఈశ్వరరావు, కోరా జగదీష్ కొర్ని రాజారమేష్ ,మాజీ జెడ్పీటిసి నీలేంద్రరావు పాల్గొన్నారు.

**అనకాపల్లి డెస్క్ :** నర్సీపట్నం మున్సిపాలిటీలోని 11వ వార్డు పెదబొడ్డేపల్లిలో వార్డు కౌన్సిలర్ బేతిరెడ్డి రత్నం, విజయ్ కుమార్ ఆధ్వర్యంలో జగనన్న ఇళ్ల లబ్ధిదారులకు ఒక సెంటు పట్టాలను మున్సిపల్ చైర్‌పర్సన్ బోడపాటి సుబ్బలక్ష్మి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, నర్సీపట్నం అభివృద్ధికి ఎమ్మెల్యే గణేష్‌విశేష కృషి చేశారని, రూ. 80 లక్షలతో సిమెంట్ రోడ్లు వేశామన్నారు. కార్యక్రమంలో వైసిపి టౌన్ అధ్యక్షులు ఏకా శివ, జగనన్న సచివాలయాల కన్వీనర్ తమరాన శ్రీను, కౌన్సిలర్ బుల్లిదొర, బ్యాంక్ సొసైటీ చైర్మన్ చిన్ననాయుడు, వార్డు కన్వీనర్ బేతిరెడ్డి విజయ్, షేక్ రోజా పాల్గొన్నారు.

# నేరాలు ఘోరాలు

## ఇంజనీరింగ్ విద్యార్థి హత్య

**ప్రజాశక్తి -మధురవాడ :** పోతిన మల్లయ్యపాలెం పోలీస్ స్టేషన్ పరిధిలో ఇంజనీరింగ్ విద్యార్థి ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడినట్లు సిఐ వై.రామకృష్ణ తెలిపారు. సిఐ కథనం ప్రకారం... శ్రీకాకుళం జిల్లా నరసన్నపేట ప్రాంతానికి చెందిన కె.జస్వంత్ (19) రుషికొండ సమీపంలోని ఒక హాస్టల్‌లో ఉండి గీతం ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ మొదటి ఏడాది చదువుతున్నాడు. బుధవారం ఫీట్స్ రావడంతో జస్వంత్ ఆసుపత్రికి వెళుతున్నట్లు అతని తల్లిదండ్రులకు హాస్టల్ వార్డెన్ సమాచారం అందించారు. జస్వంత్ ఆసుపత్రి నుంచి వచ్చి తన గదిలో ఫ్యాన్‌కు ఉరివేసుకున్నాడు. తోటి విద్యార్థులు గుర్తించి కిందకు దించి ఆసుపత్రికి తరలించారు. కుటుంబ సభ్యులు వచ్చే సరికి మృతి చెందాడు. తండ్రి రమేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు సిఐ తెలిపారు.

## ఎల్ఐసి డిఒ ఆత్మహత్య

**ప్రజాశక్తి -భీమునిపట్నం :** స్థానిక బ్యాంక్ కాలనీ, మహాలక్ష్మీపురానికి చెందిన ఎల్ఐసి డెవలప్‌మెంట్ ఆఫీసర్ చావలి వెంకటగణపతిరావు (57) పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన బుధవారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. ఎస్ఐ జి.హరీష్ కథనం ప్రకారం.. విశాఖ నగరంలోని సీతమ్మధార ఎల్ఐసి బ్రాంచిలో డెవలప్‌మెంట్ ఆఫీసర్‌గా వెంకట గణపతిరావు పనిచేస్తున్నారు. బుధవారం ఇంటి వద్దనే ఉన్నారు. బి.టెక్ చదువుతున్న కుమారుడు సాయి వెంకట సూర్య భరద్వాజ్ ఇంటి మెడపై చదువుతూ, మధ్యాహ్నం 1 గంట సమయంలో కిందకు దిగారు. తండ్రి వద్ద నుంచి పురుగుల మందు వాసన రావడంతో హుటాహుటిన సంగివలస అనిల్ నీరుకొండ ఆసుపత్రికి తీసుకెళ్లారు. పరిస్థితి విషమించడంతో మృతి చెందారు. తండ్రి మృతిపై ఎటువంటి అనుమానం లేదని పోలీసులకిచ్చిన ఫిర్యాదులో మృతుని కుమారుడు పేర్కొన్నారు. ఎస్ఐ హరీష్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## స్పా సెంటర్లపై పోలీసుల దాడి

**ప్రజాశక్తి -గాజువాక :** గాజువాకలోని స్పా మసాజ్ సెంటర్లపై గాజువాక పోలీసులు దాడి చేశారు. ఆ సెంటర్ల యజమానులపై కేసులు నమోదు చేశారు. ఈ మసాజ్ సెంటర్లలో వ్యభిచారం నడుపుతున్న అభియోగంపై దాడి చేసి 15 మందిని అదుపులో తీసుకున్నారు. గాజువాక పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు

**ప్రజాశక్తి-పద్మనాభం :** మండలంలోని పలు గ్రామాల్లో అబివృద్ధి పనులకు ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు గురువారం శంకుస్థాపనలు చేశారు. సుమారు రూ.1.16 కోట్లతో జలజీవన మిషన్ కింద అనంతవరంలోను, గొల్లలపాలెంలోనూ, రూ.40 లక్షలతో కొవ్వాడలో కుళాయిల ఏర్పాటుకు శంకుస్థాపన చేశారు. సుమారు రూ.55లక్షలతో నిర్మించిన రైతు భరోసా కేంద్రం, గ్రామీణ ఆరోగ్యకేంద్రాలను, గంధవరంలో రూ.19 లక్షలతో నిర్మించిన గ్రామీణ ఆరోగ్యకేంద్రాన్ని, భాందేవుపురంలో రూ.26 లక్షలతో నిర్మించిన గ్రామీణ ఆరోగ్యకేంద్రం, రూ.19 లక్షలతో నిర్మించిన రైతు భరోసా కేంద్రాలను ఆయన ప్రారంభించారు. పోట్నూరు గ్రామంలో సుమారు రూ.92 లక్షలతో, తునివలసలో రూ.45 లక్షలతో ఏర్పాటుచేయనున్న జలజీవన్ మిషన్ పనులకు భూమి పూజచేశారు. ఈ కార్యక్రమములో ఎంపిపి కె.రాంబాబు, జిల్లాపరిషత్ వైస్ చైర్మన్ సుంకర గిరిబాబు, మండల వైసిపి అధ్యక్షులు కె.లక్ష్మణరావు, ఎంపిడిఒ బి.శైలజ, తదితరులు పాల్గొన్నారు.

## జోరుగా ఢిల్లీ క్యాపిటల్స్ జట్టు ప్రాక్టీసు

**ప్రజాశక్తి- పిఎం పాలెం :** ఐపిఎల్ టోర్నీలో భాగంగా ఢిల్లీ క్యాపిటల్ జట్టు క్రీడాకారులు గురువారం డాక్టర్ వైఎస్ఆర్ ఎసిఎ-విడిసిఎ స్టేడియంలో జోరుగా ప్రాక్టీస్ కొనసాగించారు. క్రీడాకారులు రిషబ్‌పంత్, రిక్కీభుయ్, ఇషాంత్‌శర్మ, ఖలీల్ అహ్మద్, లలిత్ యాదవ్, సుమిత్ కుమార్, కుమార్ కుష్రగా తదతరులు రాత్రి 7.30 గంటల వరకు ప్రాక్టీసు చేశారు.



ప్రాక్టీస్ చేస్తున్న ఢిల్లీ క్యాపిటల్స్ జట్టు

## 16న జాతీయ లోక్ అదాలత్

**ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ :** జిల్లాలోని అన్ని న్యాయ స్థానాల్లో ఈ నెల 16న జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమం జరగనున్నట్లు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఎంవి.శేషమ్మ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని న్యాయ స్థానాల్లో పెండింగ్ కేసులు, సివిల్, చెక్ బౌన్స్, బ్యాంకింగ్, మోటార్ ప్రమాదాల నష్ట పరిహారాల కేసులు, సెక్షన్ 138 నెగోషియబుల్ ఇనస్ట్రుమెంట్ చట్టం కేసులు, ఆర్థిక లావాదేవీలు, భూ వ్యవహారాలకు సంబంధించిన కేసులు, కుటుంబ తాగాదాలు, కార్మిక, పారిశ్రామిక వివాద కేసులు లోక్ అదాలత్‌లో పరిష్కారానికి వస్తాయని పేర్కొన్నారు. కక్షిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు.

## అభివృద్ధి పనుల పరిశీలన

**ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ :** నగరంలో చేపడుతున్న పలు అభివృద్ధి పనులను త్వరతగతిన పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని జివిఎంసి కమిషనర్ సిఎం.సాయికాంత్ వర్మ అధికారులను ఆదేశించారు. గురువారం ఆయన పోలమాంబ ఆలయం నుంచి మెంటల్ కేర్, చెస్ట్ ఆసుపత్రి మీదుగా బీచ్ రోడ్డు వరకు విస్తరిస్తున్న రోడ్డు అభివృద్ధి పనులతో పాటు స్వర్ణ భారతి ఇండోర్ స్టేడియం, జగదాంబ జంక్షన్ వద్ద క్లాక్ టవర్ మొదలైన అభివృద్ధి పనులను అధికారులతో కలిసి పరిశీలించారు. కార్యక్రమంలో కార్యనిర్వాహక ఇంజినీరు సుబ్బారావు, అసిస్టెంట్ సిటీ ప్లానర్ వెంకటేశ్వరరావు, టిపిఒ ప్రమీల తదితరులు పాల్గొన్నారు.

## 16న గాయత్రి డిగ్రీ కళాశాల స్నాతకోత్సవం

**ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ :** గాయత్రి విద్యా పరిషత్ డిగ్రీ కళాశాల 11, 12వ స్నాతకోత్సవాన్ని ఈ నెల 16వ తేదీన రుషికొండ వద్ద ఉన్న గాయత్రి విద్యా పరిషత్ కళాశాల ఆడిటోరియంలో నిర్వహిస్తున్నామని కళాశాల కంట్రోల్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ అధికారి కె.మురళి సోమేశ్వరరావు తెలిపారు. గురువారం ఉదయం ఎంవిపి.కాలనీలోని గాయత్రి విద్యా పరిషత్ కాలేజ్ ఫర్ డిగ్రీ అండ్ పీజీ కోర్సెస్ (అటానమస్) కేంద్రంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. కళాశాల ప్రగతిని వివరించారు. గాయత్రి విద్యా పరిషత్ సంస్థ యాజమాన్య సభ్యులు డివిఎస్.కామేశ్వరరావు మాట్లాడుతూ స్నాతకోత్సవ వివరాలను వెల్లడించారు. స్నాతకోత్సవ వేడుకకు ముఖ్యఅతిథిగా ఆంధ్ర విశ్వ కళాపరిషత్తు ఉపకులపతి ఆచార్య పివిజిడి ప్రసాద్ రెడ్డి హాజరవుతారని తెలిపారు.

## కార్ల బుకింగ్ ప్రారంభం

**ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ :** ప్రముఖ కార్ల సంస్థ ఎంజి మోటార్స్ రెండు నూతన మోడళ్లను అందుబాటులోకి తీసుకు వచ్చిందని ఎమ్‌డి మోటార్స్ విశాఖపట్నం సేల్ హెడ్ జాన్సన్ తెలిపారు. గురువారం సాయంత్రం బీచ్ రోడ్‌లోని ఎంజి మోటార్స్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎంజి మోటార్స్ ఎలక్ట్రానిక్ విభాగంలో రెండు నూతన మోడళ్లను మార్కెట్‌లోకి విడుదల చేశామన్నారు. గడిచిన రెండు రోజులలో 26 బుకింగ్స్ నమోదైనట్లు తెలిపారు. నూతన మోడల్స్ వివరాలను తెలియజేశారు. మీడియా సమావేశంలో ఇంటర్నల్ ట్రైనర్ రవితేజ పాల్గొన్నారు.

## కౌంటింగ్ కేంద్రాల్లో ఏర్పాట్ల పరిశీలన

**ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ :** ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు స్ట్రాంగ్ రూమ్, కౌంటింగ్ కేంద్రాల్లో ఏర్పాట్లు చేయాలని వివిధ విభాగాల అధికారులను జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లిఖార్జున ఆదేశించారు. ఎలాంటి భద్రతాపరమైన లోపాలు లేకుండా పటిష్ట చర్యలు చేపట్టాలని, ప్రతి కేంద్రాన్ని క్షుణ్ణంగా పరిశీలించుకొని సంబంధిత ఏర్పాట్లు చేసుకోవాలని అధికారులకు సూచించారు. పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎ.రవిశంకర్, జీవీఎంసీ కమిషనర్ సీఎం సాయికాంత్ వర్మ, జాయింట్ కలెక్టర్ కె. మయూర్ అశోక్, డీఆర్వో కె.మోహన్ కుమార్, ఇతర అధికారులతో కలిసి ఆంధ్రా యూనివర్శిటీ ఇంజనీరింగ్ కళాశాల పరిధిలోని పలు భవనాలను గురువారం ఆయన పరిశీలించారు.

## జివిఎంసి ఉన్నత పాఠశాలకు డిజిటల్ ల్యాబ్ మంజూరు

**ప్రజాశక్తి -అనకాపల్లి :** జీవీఎంసీ హైస్కూల్‌కు కెనరా బ్యాంకు అనకాపల్లి శాఖ డిజిటల్ లాబ్‌ను మంజూరు చేసింది. ఈ మేరకు గురువారం రీజనల్ జాయింట్ మేనేజర్ ఐవి.కృష్ణప్రభు దానిని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కెనరా బ్యాంక్ సీనియర్ మేనేజర్స్ సతీష్, అనకాపల్లి శాఖ సీనియర్ మేనేజర్ బాలకృష్ణ, పాఠశాల విద్యా కమిటీ ఎక్స్ అఫీషియో మెంబర్ జాజుల రమేష్ పాల్గొన్నారు. పాఠశాల హెచ్‌ఎం బ్రహ్మాజీ, ఉపాధ్యాయ సిబ్బంది పాఠశాల విద్యార్థుల తరపున కృతజ్ఞతలు తెలియజేశారు.

# రైల్వే జోన్ ఉద్యమకారులపై కేసు కొట్టివేత

**ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ :** విభజన చట్టంలోని హామీలు అమలు చేయాలని, విశాఖ కేంద్రంగా రైల్వే జోన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేసిన ఉద్యమకారులపై రైల్వే పోలీసులు బనాయించిన అక్రమ కేసు నుంచి రైల్వే కోర్టులో ఊరట లభించింది. 2017లో రైల్వే పోలీసులు అక్రమంగా మాజీ పార్లమెంట్ సభ్యుడు, రాష్ట్ర మాజీ మంత్రి కొణతాల రామకృష్ణ, సిపిఎం సీనియర్ రాష్ట్ర నాయకులు సిహెచ్.నర్సింగరావు, సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జెవి.సత్యనారాయణమూర్తి, సిపిఐ జిల్లా కార్యదర్శి ఎం పైడిరాజు, సిపిఎం కార్పొరేటర్ బి.గంగారావు, సిఐటియు నాయకులు ఆర్‌కెఎస్‌వి.కుమార్, ఐఎన్‌టియుసి నాయకులు మంత్రి రాజశేఖర్, కార్పొరేటర్ బెహరా భాస్కరరావులపై పెట్టిన కేసును గురువారం సాయంత్రం రైల్వే కోర్టు న్యాయమూర్తి కొట్టేవేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ నాడు చేసిన వాగ్ధానాలను ఎందుకు అమలు చేయడం లేదని చలో ఢిల్లీ వెళుతున్న కొణతాల రామకృష్ణ బృందాన్ని పరామర్శించి సంఘీభావం ప్రకటించడానికి విశాఖ రైల్వే స్టేషన్‌కి వెళ్ళిన నేతలపై కేసులు నమోదు చేశారని అన్నారు. 2019 ఎన్నికల ప్రచారంలో భాగంగా విశాఖ వచ్చిన ప్రధాని నరేంద్రమోడీ విశాఖ కేంద్రంగా రైల్వే జోన్ ఏర్పాటు చేస్తామని ప్రకటించారని, నేటికీ కార్యరూపం దాల్చలేదని విమర్శించారు. తాము కేసులకు భయపడేది లేదని జోన్ ఏర్పాటు అయ్యే వరకు పోరాటాలు నిర్వహిస్తామని నాయకులు స్పష్టం చేశారు. రైల్వే జోన్ కార్యకలాపాలు ఇప్పటికైనా ప్రారంభించాలని కోరారు.



కేసు కొట్టివేత అనంతరం న్యాయవాదులతో నాయకులు సిహెచ్.నర్సింగరావు, జెవి తదితరులు

# సింబయో ప్రమాదంపై సమగ్ర విచారణ జరపాలి

**ప్రజాశక్తి- అనకాపల్లి :** అచ్యుతాపురం-రాంబిల్లి ఎస్ఇజెడ్ పరిధిలోని సింబయో జెనరిక్స్ ఫార్మా కంపెనీలో బుధవారం జరిగిన ప్రమాదంపై సమగ్ర విచారణ జరిపించాలని, గాయపడిన కార్మికులకు మెరుగైన వైద్యం అదించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి కె.లోకనాథం డిమాండ్ చేశారు. ఈ మేరకు లోకనాథం గురువారం కలెక్టర్‌కు లేఖ రాశారు. సింబయో ఫార్మాలో జరిగిన బాయిలర్ లీక్ ప్రమాదంలో రాంబిల్లి మండలానికి చెందిన కలవలపల్లి నర్సింగరావు, అమలకంటి సన్యాసిరావు, చోడవరం మండలానికి చెందిన అట్టా రాము కార్మికులు గాయపడ్డారని, వారిలో ఇద్దరు కార్మికుల పరిస్థితి సీరియస్‌గా వుందని పేర్కొన్నారు. క్షతగాత్రులకు కోలుకునే వరకు మెరుగైన వైద్యం అందించాలని, ఈ ప్రమాదంపై సమగ్ర విచారణ జరిపి కంపెనీ యాజన్యంపై చర్యలు తీసుకోవాలని కోరారు.

**కలెక్టర్‌కు సిపిఎం జిల్లా కార్యదర్శి లోకనాథం లేఖ**

**దర్యాప్తు చేయాలని సిఐటియు డిమాండ్**

సింబయో జనరిక్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలో బుధవారం బాయిలర్ వద్ద పైప్ లీకైన ప్రమాదంలో ముగ్గురు కార్మికులు తీవ్ర గాయాలు పాలైన ఘటనపై సమగ్ర దర్యాప్తు చేయాలని సీఐటీయూ అనకాపల్లి జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు సీఐటీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి, కోశాధికారి ఆర్.శంకరరావు, జి.కోటేశ్వరరావు, వివి.శ్రీనివాసరావు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని, క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని కోరారు.

## న్యాయవాదుల అరెస్టు అన్యాయం

**ప్రజాశక్తి-అనకాపల్లి :** భూమి యాజమాన్య హక్కు చట్టాన్ని రద్దు చేయాలని ఆందోళన చేస్తున్న న్యాయవాదులను అరెస్టు చేయడం అన్యాయమని హ్యూమన్ రైట్స్ ఆర్గనైజేషన్ చైర్మన్ టీఎస్ రామచంద్ర నాయుడు, నేషనల్ హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ ఫోర్స్ జాతీయ వైస్ చైర్మన్ ఎం మురళి అన్నారు. స్థానిక జిల్లా కోర్టు సముదాయం వద్ద నిరాహార దీక్ష శిబిరాన్ని వారు సందర్శించారు. కార్యక్రమంలో అనకాపల్లి బార్ అసోసియేషన్ అధ్యక్షులు శేఖర మంత్రి సాయి లక్ష్మణరావు, న్యాయవాదులు సుధాకర్, ఐఆర్ గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రతిపక్ష పార్టీల కార్యకర్తలపై బైండోవర్ సరికాదు

**ప్రజాశక్తి-అనకాపల్లి :** త్వరలో జరగబోయే సార్వత్రా ఎన్నికలు నేపథ్యంలో పోలీస్ శాఖ ప్రతిపక్ష పార్టీలకు చెందిన కార్యకర్తలను బైండోవర్ పేరు చెప్పి వాళ్ళు గృహాలకు వచ్చి సంతకాల పెట్టమని, పోలీస్ స్టేషన్‌కి రమ్మని భయాందోళనకు గురి చేయడం తగదని జనసేన పార్టీ నాయకులు బుద్ధ రాజేష్ అన్నారు. ఉత్తరాంధ్ర చర్చ వేదిక కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పోలీస్ శాఖ అధికార పార్టీ కార్యకర్తలను కూడా ఇదే విధంగా తీసుకుంటున్నారా అని ప్రశ్నించారు.

## 60 లీటర్ల నాటుసారా స్వాధీనం

**ప్రజాశక్తి - బుచ్చియ్యపేట :** మండలంలోని నీలకంఠాపురం గ్రామ సరిహద్దుల్లో నాటుసారా వంటలు జరుగుతున్నాయని సమాచారం మేరకు స్థానిక ఎస్ఐ ఈశ్వరరావు ఆధ్వర్యాన పోలీసులు గురువారం దాడులు నిర్వహించారు. నీలకంఠాపురం గ్రామానికి చెందిన పడాల నాయుడు నాటుసారా తయారు చేస్తుండగా ఆయన్ను అదుపులోకి తీసుకొని, అతని వద్ద నుంచి 60 లీటర్ల నాటు సారాను స్వాధీనం చేసుకున్నారు. 500 లీటర్ల బెల్లం పులుపును, వస్తువులను ధ్వంసం చేశారు.

## సూపర్ సిక్స్ పథకాలపై విస్తృత ప్రచారం

**డుంబ్రిగుడ:** మండలంలోని పోతంగి పంచాయతీ పరిధిలోని గిరిజన గ్రామాల్లో టిడిపి మండల అధ్యక్షుడు తుడుము సుబ్బారావు ఆధ్వర్యంలో సూపర్ సిక్స్ పథకాలపై గురువారం ప్రచారాన్ని నిర్వహించారు. బీజుమరవలస, అమలగుడ, జాముగుడ, దొడువలస గ్రామాల్లో ఇంటింటికెళ్లి టిడిపి, జనసేన, బిజెపి మ్యానిఫెస్టోలోని పథకాలను వివరించారు . టిడిపితోనే గిరిజన గ్రామాలు అభివృద్ధి చెందాయని, చంద్రబాబును మళ్లీ ముఖ్యమంత్రిని చేసేందుకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో మాజీ సర్పంచులు సుబ్బారావు, జగన్, సుబ్బారావు, లక్ష్మణ్ పాల్గొన్నారు.

## బకాయి జీతాలు చెల్లించాలని పంచాయతీ కార్మికుల ధర్నా

**ప్రజాశక్తి-కె.కోటపాడు :** పంచాయతీ కార్మికులు, గ్రీన్ అంబాసిడర్‌లకు బకాయిలు పడ్డ జీతాలు చెల్లించాలని, ఇతర సమస్యలను పరిష్కరించాలని కోరుతూ స్థానిక ఎంపిడిఒ కార్యాలయం ఎదుటు సిఐటియు ఆధ్వర్యాన గురువారం కార్మికులు ధర్నా నిర్వహించారు. దీనికి ముందు సిఐటియు కార్యాలయం నుంచి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పంచాయితీ కార్మికుల సంఘం మండల గౌరవ అధ్యక్షుడు గాడి ప్రసాద్ మాట్లాడుతూ ఏడు నెలలుగా జీతాలు చెల్లించకపోవడంతో కార్మికులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పంచాయతీ కార్మికులకు బూట్లు, గ్లౌజులు, సబ్బులు, గుర్తింపు కార్డులు ఇవ్వాలని కోరారు. పెరిగిన ధరలకు అనుగుణంగా పంచాయతీ కార్మికులకు నెల జీతం రూ.10వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు ఎర్ర దేవుడు, నాగరాజు, సింహాద్రి, చెల్లయ్య, రాంబాబు, ఈశ్వరరావు, పైడితల్లమ్మ, తదితరులు పాల్గొన్నారు.

## లాలం లక్ష్మణరావుకు ఘన నివాళి

**ప్రజాశక్తి- అనకాపల్లి :** విద్యార్థి, గిరిజన ఉద్యమ నాయకులు కామ్రేడ్ లాలం లక్ష్మణరావు 18వ వర్ధంతి సభ గురువారం అనకాపల్లి సిపిఎం జిల్లా కార్యాలయంలో నిర్వహించారు. సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఆర్. శంకరరావు, సీనియర్ నాయకులు కర్రి అప్పారావు లక్ష్మణరావు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆర్. శంకరరావు మాట్లాడుతూ అనకాపల్లి ఎఎంఎఎల్ కాలేజీలో చదువుతున్న రోజుల్లోనే ఎస్ఎఫ్ఐలో చేరిన లక్ష్మణరావు జిల్లాలో విద్యార్థి ఉద్యమ నిర్మాణంలో కీలకంగా వ్యవహరించారని తెలిపారు. విద్యుత్ ఉద్యమంలోనూ, జిల్లాలో జరిగిన అనేక పోరాటాల్లో చురుగ్గా పాల్గొన్నారని గుర్తు చేశారు. గిరిజన ప్రాంతంలో ఆదివాసిల సమస్యలపైనా ఆయన పనిచేశారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కన్వీనర్ గంటా శ్రీరామ్, నాయకులు కె.ఈశ్వరరావు, బి.ఉమామహేశ్వరరావు, కె.సదాశివరావు, బి.నూకఅప్పారావు పాల్గొన్నారు.

## చింతాలు లేని లోటు తీరనిది

**ప్రజాశక్తి- కె.కోటపాడు :** సిఐటియు జిల్లా నాయకులు గోగాడ చింతాలు లేని లోటు తీరనిదని ఏపీ రైతు సంఘం జిల్లా కోశాధికారి గండి నాయనబాబు, సిపిఎం మండల కన్వీనర్ రొంగలి ముత్యాల నాయుడు, ప్రజా సంఘాల మండల కన్వీనర్ ఎర్ర దేవుడు అన్నారు. స్థానిక సిఐటియు కార్యాలయంలో గురువారం చింతాలు 4వ వర్ధంతి సభ నిర్వహించారు. చింతాలు చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలో సిఐటియు జెండా దిగ్విజయంగా ఎగురుతుందంటే చింతాలు చేసిన కృషి కారణమని చెప్పారు. కార్యక్రమంలో గాడి ప్రసాద్. జి కుమారి పాల్గొన్నారు.

## నూకాంబికను దర్శించుకున్న అమర్‌నాథ్

**ప్రజాశక్తి-అనకాపల్లి :** వైసిపి గాజువాక నియోజకవర్గం సమన్వయకర్తగా నియమితులైన సందర్భంగా, అనకాపల్లి శాసనసభ్యులు, రాష్ట్ర మంత్రి గుడివాడ అమర్నాథ్ గురువారం శ్రీనూకాంబిక అమ్మవారిని దర్శించుకొని పూజలు నిర్వహించారు. కోటి అరవై లక్షల రూపాయిలతో భక్తుల అవసరార్థం నిర్మించబోయే క్యూ కాంప్లెక్స్ మండపానికి శంకుస్థాపన చేశారు. మాలధారణ ఆశ్రమం వారు ఏర్పాటు చేసిన నమూనా దేవాలయాన్ని సందర్శించారు. అమ్మవారి నూతన దేవాలయం నిర్మాణాన్ని పరిశీలించి సత్వరమే పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో అనకాపల్లి నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్, ఆలయ చైర్మన్ కొణతాల మురళీకృష్ణ, ఈఓ, బండారు ప్రసాద్, ఆలయ ధర్మకర్తలు, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

## మహిళల భద్రతకు వినూత్న పరికరం

**ప్రజాశక్తి-అనకాపల్లి :** స్థానిక డైట్ కళాశాల విద్యార్థులు మహిళల భద్రతకు ఒక వినూత్న పరికరాన్ని తయారు చేశారు. ఈ పరికరంతో ఆకతాయిల పని పట్టవచ్చని ఈ.సి.ఈ విభాగాధిపతి డాక్టర్ పి.పూర్ణ ప్రియ తెలిపారు. ఈ మేరకు గురువారం పరికరాన్ని డెమో చేసి చూపించారు. అపద సమయాలలో పరికరానికి అమర్చిన బటన్ నొక్కితే ఆకతాయిలు చిన్న షాక్‌కు గురవుతారని, ఏమి జరిగిందో తెలుసుకునే లోపే మహిళలు ఆకతాయిల నుండి తప్పించుకోవచ్చని ప్రోజెక్ట్ ఇంజినీర్ బి.శేషగిరి రావు తెలిపారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ దాడి రత్నాకర్, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.వైకుంఠ రావు,డీన్ అకాడమిక్ డాక్టర్ కె.పార్వతి, ప్రోజెక్ట్ గైడ్ ఎం.హేమలత, విద్యార్థులు వై.నీహారిక, పి.హేమలత, బి.ఓం సాయి వాసంతి పాల్గొన్నారు.